PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 237 | విజయవాడ, ఆదివారం 30 మార్చి 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 30 March 2025 | Rs

**ప్రతిభావంతులకు పురస్కారాలు**

- కళారత్న 86, ఉగాది అవార్డులకు 116 మంది ఎంపిక

6

ప్రజాశక్తి పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

**ఉగాది శుభాకాంక్షలు**

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. సోమవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

-చీఫ్ జనరల్ మేనేజర్



# 'ఉపాధి' బకాయి రూ.26 వేల కోట్లు

## గ్రామీణ పేదల పొట్టగొడుతున్న కేంద్రం

## ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సింది రూ.2,030 కోట్లు



**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజి) కింద ఈ ఏడాది మార్చి 21 నాటికి కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు రావలసిన బకాయి అక్షరాల రూ.26 వేలకోట్లు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన బకాయి రూ.2,030 కోట్లు కాగా, కేరళకు రావాల్సినది రూ.1,055.81 కోట్లు. రాజ్యసభలో సిపిఎం ఎంపి వి.సదాశివన్‌కు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానంలో ఈ విషయం వెల్లడైంది. ఈ మొత్తంలో కార్మికుల వేతనాల కింద రూ.1,5277.0 కోట్లు, సామాగ్రి, పాలనాపరమైన ఖర్చుల కింద రూ.10,820.23 కోట్లు ఇవ్వాల్సివుంది.

బకాయి మొత్తాల గురించి ఎప్పుడు ప్రశ్నించినా, రాష్ట్రాలు ఇంకా పద్దులు సమర్పించలేదని సాకులు చెబుతూ కేంద్ర ప్రభుత్వం ఈ విషయానికి సమాధానం ఇవ్వకుండా తప్పించుకుంటోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి బదులుగా కేంద్రం చెల్లింపులను నిలుపు చేస్తోంది. దీనివల్ల గ్రామీణ కార్మికుల జీవనోపాధి దెబ్బతింటోంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొత్తం రాష్ట్రాలకు కేంద్రం చెల్లించాల్సిన బకాయిలు 26,097.23 కోట్లుగా వుంది.

బిజెపి పాలిత 'డబుల్ ఇంజన్' రాష్ట్రాల్లో కూడా పెద్ద మొత్తాల్లోనే బకాయిలు పెండింగ్‌లో వున్నాయి. ఆ రాష్ట్రాలు కూడా ఇంకా పద్దులు అందచేయలేదనే వాదననే కేంద్ర ప్రభుత్వం చేస్తుందా లేదా అన్నదే ఇక్కడ కీలకమైన ప్రశ్న. ఇంత పెద్ద మొత్తాలను విడుదల చేయడంలో ఇలా జాప్యం జరగడం వల్ల ఉపాధి కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లింపులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి ఫలితంగా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులకు ఆటంకం కలుగుతోంది. నిరుపేదలైన గ్రామీణ కూలీల వేతనాలను ఇలా నిలుపుచేయడమనేది పెద్ద సవాలుగా మారుతోంది.

భారతదేశం ఆర్థిక అగ్రశక్తిగా ఆవిర్భవిస్తోందని కేంద్ర ప్రభుత్వం ఒక పక్క గొప్పలు చెప్పుకుంటోంది. కానీ, మరోపక్క కోట్ల మంది పేద కూలీలకు జీవనాడిగా వున్న గ్రామీణ ఉపాధి హామీ పనులకు అవసరమైన నిధులను కూడా విడుదల చేయడంలో విఫలమవుతోంది. 'ఉపాధి' చట్టాన్ని దెబ్బ తీయాలనే ఇలా వేతనాల చెల్లింపులను ఉద్దేశ్యపూర్వకంగా మోడీ ప్రభుత్వం జాప్యం చేస్తోంది. మీడియా ఈ అంశంపై తీవ్రంగా దృష్టి సారించి, దీనికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపి సదాశివన్ కోరారు.

**మార్చి 21 నాటికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద వివిధ రాష్ట్రాలకు రావాల్సిన బకాయిలు**

| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 2,030.47 |
| కేరళ | 1,055.81 |
| రాజస్థాన్ | 2,129.51 |
| ఉత్తరప్రదేశ్ | 3,668.29 |
| మధ్యప్రదేశ్ | 1,151.35 |
| తమిళనాడు | 3,725.11 |
| మహారాష్ట్ర | 2,825.46 |
| కర్ణాటక | 609.98 |
| ఒడిశా | 586.68 |
| బీహార్ | 2,849.35 |
| జార్ఖండ్ | 662.88 |
| తెలంగాణ | 577.89 |
| అస్సాం | 538.47 |
| చత్తీస్‌గఢ్ | 586.82 |
| గుజరాత్ | 197.22 |
| పంజాబ్ | 243.84 |
| హిమాచల్ ప్రదేశ్ | 292.13 |
| హర్యానా | 161.34 |
| ఉత్తరాఖండ్ | 218.98 |
| త్రిపుర | 169.55 |
| మేఘాలయ | 499.56 |
| నాగాలాండ్ | 77.08 |
| అరుణాచల్ ప్రదేశ్ | 268.7 |
| మిజోరాం | 53.45 |
| సిక్కిం | 46.52 |
| మణిపూర్ | 398.3 |
| గోవా | 0.99 |
| లడక్ | 2.39 |
| పుదుచ్చేరి | 3.98 |
| జమ్మూ కాశ్మీర్ | 465.14 |
| **మొత్తం** | **26,097.23** |

# మే 20న గ్రామీణ హర్తాళ్


- వ్యవసాయ కార్మిక సంఘాల అఖిల భారత వేదిక పిలుపు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా మే 20న అఖిల భారత గ్రామీణ హర్తాళ్ నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘాల అఖిల భారత వేదిక పిలుపునిచ్చింది. నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలనే మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన అఖిల భారత సమ్మెకు అనుసంధానిస్తూ గ్రామీణ హర్తాళ్ చేపట్టనున్నట్లు ప్రకటించాయి. కార్మిక కోడ్స్ అమలైతే గ్రామీణ పేదలు నయా బానిసలుగా దిగజారిపోతారని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని ప్రధాని మోడీ చెబుతున్నారని, మరి ఆ అభివృద్ధిలో ఉపాధి కార్మికుల వేతనాలు పెరగవా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఉపాధి రోజు వేతనాలు నిర్ణయిస్తూ రాష్ట్రాలకు ఉత్తర్వులు ఇచ్చిందని, ఉపాధి హామీ చట్టానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వేతనాలు నిర్ణయిస్తుందని విమర్శించారు. చట్టప్రకారం ఆయా రాష్ట్రాల కనీస వేతనాలు కంటే తక్కువ ఉండకూడదని, కానీ కేంద్రం కేరళలో రోజు కనీసం వేతనం రూ.800 ఉంటే అక్కడ రూ.369, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అనేక వ్యవసాయ పనులకు రూ.400 పైగా కనీస వేతనం ఉంటే, రూ.307 నిర్ణయించింద న్నారు. ఉపాధి హామీ చట్టానికి మోడీ ప్రభుత్వమే పెద్ద శత్రువుగా మారిందన్నారు. మే 20న గ్రామీణ హర్తాళ్‌ను జయప్రదం చేసి ఉపాధిని కాపాడుకుందామని వెంకట్ పిలుపు నిచ్చారు. ఎపిలో చంద్రబాబు, జగన్ బిజెపి జెరాక్స్‌గా పోటీపడుతున్నారని, చంద్రబాబు విజన్‌లో ప్రతి కుటుంబానికి రెండెకరాల భూమి లేదని అన్నారు. పేదల సంక్షేమం కార్పొరేట్లకు అప్పగించారని విమర్శించారు.

# ఆక్రమణదారుగా ట్రంప్

- బిజెపి ప్రభుత్వం అమెరికాకు లొంగుబాటు
- సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు అరుణ్ కుమార్



సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.అరుణ్ కుమార్

**ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి**

అమెరికా అధ్యక్షులు ట్రంప్ నేతృత్వంలో ఆ దేశం ఆక్రమణదారుగా వ్యవహరిస్తోందని సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.అరుణ్‌కుమార్ విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమెరికాకు పూర్తిగా లొంగుబాటుగా వ్యవహరిస్తోంద న్నారు. 'ట్రంప్ విధానాలు- భారతదేశంపై ప్రభావం' అనే అంశంపై సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ డిపిసి భవనంలో శనివారం సదస్సు జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప అధ్యక్షతన వహించిన ఈ సదస్సులో ప్రధాన వక్త అరుణ్ కుమార్ మాట్లాడు తూ అమెరికా విస్తరణవాదాన్ని కొనసాగిస్తోంద న్నారు. పనామా, గ్రీన్‌ల్యాండ్, కెనాడా వంటి దేశాలను ఆక్రమించాలని చూస్తోందని తెలిపారు. ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి విధ్వంసకర విధానాల అమలును అమెరికా వేగవంతం చేసిందన్నారు. ఇందులో భాగంగానే రోజుకొక వివాదాస్పద నిర్ణయాన్ని ప్రకటిస్తున్నారని విమర్శించారు. అమెరికా ఎప్పుడూ తన ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు చేస్తోందన్నారు. తన ప్రయోజనాల కోసమే ఉక్రెయిన్, రష్యా మధ్య చిచ్చుపెట్టి ఈ రెండు దేశాల మధ్య యుద్ధానికి తెరలేపిందన్నారు. ఇజ్రాయిల్‌కు ఆయుధ, ఇతర విధాలుగా సహాయ, సహకారాలు అందించి పాలస్తీనాపై దాడిని ప్రోత్సహించింద న్నారు. ఇప్పుడు శాంతిమంత్రం జపిస్తోందని, ఈ విషయంలోనూ అమెరికా ప్రయోజనాలు దాగి ఉన్నాయని వివరించారు. ఇదంతా శక్తివంతమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న చైనాను నిలువరించే క్రమంలోనే చేపడుతోందని పేర్కొన్నారు. దెబ్బతిన్న తన ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చుకునే క్రమంలో అనేక దేశాలపై ఆంక్షలను విధిస్తోందన్నారు. ఇండియా, చైనా, కెనడా, మెక్సికో దేశాలపై ఆంక్షలు విదిస్తోందన్నారు.భారత దేశానికి 'టారిఫ్ కింగ్' అని పేరు పెట్టి ట్రంప్ ఒత్తిడి పెంచుతున్నారని తెలిపారు. దీనికి భారత ప్రభుత్వం తలొగ్గిందని, గూగుల్‌కు ఆరు శాతం ట్యాక్స్ మినహాయించిందని, మోటర్ సైకిళ్లు, విస్కీపై పన్ను తగ్గింపు, వ్యవసాయ ఉత్పత్తులపై కొన్ని మినహాయింపులకు సిద్ధమైందన్నారు.

పన్ను మినహాయింపులను పరిశీలించేందుకు అమెరికా బృందం భారత్‌లో పర్యటిస్తోందన్నారు. అక్రమ వలసదారులంటూ మన దేశానికి చెందిన వారిని అనాగరికంగా బేడీలు వేసి వెనక్కు పంపుతున్నా భారత ప్రభుత్వం మౌనంగా ఉందని తెలిపారు. భారత ప్రభుత్వ లొంగుబాటు వల్ల రాబోయే రోజుల్లో మన దేశానికి తీరని నష్టం జరగనుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ విధానాలపై రాబోయే అఖిల భారత మహాసభలో చర్చిస్తామన్నారు. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, సీనియర్ నాయకులు జి.ఓబులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, హెచ్ఆర్ఎఫ్ నేత ఎస్.ఎం.బాషా, సామాజికవేత్త బోసు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను నెరవేర్చుతాం

## ఆవిర్భావ సభలో టిడిపి అధినేత చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఏప్రిల్, మే నెలల్లో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం పథకాలను అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటికే పింఛన్, అన్న క్యాంటీన్లు, ఉచిత గ్యాస్ హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. టిడిపిని స్థాపించి 43 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిర్భావ సభ జరిగింది. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఓ వైపు సంక్షేమం, అభివృద్ధి చేస్తూనే రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఉగాది రోజు పి-4కు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. రాజకీయాల్లో టిడిపి ఆవిర్భావం ఒక పెను సంచలమని చెప్పారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ అని తెలిపారు. ఎన్‌టిఆర్ పార్టీ స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. విద్యావంతులను రాజకీయాల్లోకి తెచ్చిన నాయకుడు ఎన్‌టిఆర్ అని, ఆయన అధికారంలోకి వచ్చిన తరువాతే సంక్షేమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. తెలుగువారు ఉన్నంత వరకూ టిడిపి ఉంటుందన్నారు. టిడిపి వల్లే ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ, మహిళలకు రాజకీయ అధికారం వచ్చిందన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మరింత పైకి తేస్తామన్నారు. మనందరం పార్టీకి వారసులం అని, పెత్తందారులం కాదని చెప్పారు. ఎన్‌డిఎ-1, 2లతో పాటు ప్రస్తుతం కేంద్రంలోనూ టిడిపి కీలకపాత్ర పోషిస్తోందన్నారు. 43 ఏళ్లలో పార్టీకి వచ్చిన సంక్షోభాలను అవకాశంగా తీసుకున్నా మని వెల్లడించారు. ఎన్‌టిఆర్ చేసిన చైతన్య రథం యాత్రకు, తాను నిర్వహించిన 'వస్తున్నా మీకోసం' పాదయాత్ర, లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు కార్య కర్తలు అండగా నిలబడ్డారని చెప్పారు. టిడిపిని లేకుండా చేస్తామని విర్రవీగిన వారు కాలగర్భంలో కలిసిపోయారని అన్నారు. కార్యకర్తలు హుషారుగా ఉంటే ఓటమి లేదని, జోష్ తగ్గితే విపక్షాలకు కొమ్ములు వస్తాయన్నారు. కుటుంబ పెద్దగా కార్యకర్తలను ఆదుకునే బాధ్యత తీసుకుంటానని తెలిపారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రిచంద్రబాబు

**పనిచేసే వారికి పదోన్నతి : లోకేష్**

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, నాయకులను గుర్తించి వారికి పార్టీలో పదోన్నతి కల్పిస్తానని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పారు. రెండు సార్లు ఒకే పదవి చేసిన వ్యక్తి పై స్థాయికైనా వెళ్లాలని, లేదంటే టర్మ్ గ్యాప్ అయినా తీసుకోవాలని తెలిపారు. తాను ప్రధాన కార్యదర్శిగా నాలుగోసారి పనిచేస్తున్నానని, ప్రక్షాళన తన నుంచే మొదలుపెట్టాలని అన్నారు. పార్టీలో పూర్తిస్థాయి ప్రక్షాళన చేసి త్వరలోనే అన్ని నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొనకళ్ల నారాయణ, హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులు ప్రసంగించారు.

**ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం**

- వి.శ్రీనివాసరావు

2



**ఐఎంఎఫ్ అడ్వైజరీ కౌన్సిల్‌లోకి**

# ఎన్ చంద్రశేఖరన్



**న్యూఢిల్లీ :** టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తాజాగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్స్ అడ్వైజరీ కౌన్సిల్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ గ్రోత్‌లో నియమితులయ్యారు. స్థిరమైన ఆర్థిక వృద్ధికి తోడ్పడే అనుకూలమైన స్థూల ఆర్థిక, సూక్ష్మ ఆర్థిక పరిస్థితులను ప్రోత్సహించడానికి తాము చేస్తోన్న ప్రయత్నాలకు చంద్రశేఖరన్ నియామకం మద్దతును ఇవ్వనుందని ఐఎంఎఫ్ పేర్కొంది. నూతనంగా నియమితులైన కౌన్సిల్ సభ్యులతో ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టియాన జార్జివా ప్రారంభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బోర్డ్ ఆఫ్ టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వందకు పైగా టాటా ఆపరేటింగ్ కంపెనీలకు ప్రమోటర్‌గా పనిచేస్తున్నారు. 2016 అక్టోబర్ లో టాటా సన్స్ బోర్డులో చేరిన ఆయన 2017లో ఛైర్మన్‌గా నియమితులయ్యారు.



118 మంది సిబ్బందితో ఆగ్రా నుండి మయన్మార్‌కు బయలుదేరిన ఫీల్డ్ ఆసుపత్రి

**1600 దాటిన మృతులు!**

- భారత్ సహా పలు దేశాల నుండి సాయం

5

# ప్రవీణ్ చేతులు, ముఖంపై గాయాలు

- పూర్తి రిపోర్టు వచ్చాకే మరణంపై స్పష్టత : ఐజి అశోక్ కుమార్

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఐజి అశోక్ కుమార్

పాస్టర్ ప్రవీణ్ పగడాల చేతులు, ముఖంపై గాయాలున్నట్టు పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైందని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ గాయాలపై పూర్తి నివేదిక రావాల్సి ఉందని అప్పుడే ఈ మృతిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెప్పారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌పి కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్‌పి డి.నరసింహ కిషోర్‌తో కలిసి శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కారు ఢీ కొట్టడం వల్ల గాయాలయ్యాయా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఎస్‌పి డి.నరసింహకిషోర్, ఇద్దరు డిఎస్‌పిలు, మరో నాలుగు బృందాలు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాయని చెప్పారు. పాస్టర్ ప్రవీణ్ హైదరాబాద్ నుంచి బయలుదేరిన సమయం నుంచి రాజమహేంద్రవరంలో ప్రమాద స్థలం వరకు మార్గంమధ్యలో సేకరించిన సిసి ఫుటేజీ డేటాను పాత్రికేయులకు చూపించారు. మార్గమధ్యలో టోల్ గేట్లు వద్ద సేకరించిన సిసి ఫుటేజిలు, ఇతర సంస్థల సిసి ఫుటేజిలకు సంబంధించి మొత్తం పదమూడు పాయింట్ల వద్ద ఫుటేజీలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శిస్తూ వివరణ ఇచ్చారు. రాజమహేంద్రవరం ప్రమాద స్థలానికి సమీపంలో ఉన్న కొంతమూరు పెట్రోల్ బంక్ సిసి ఫుటేజిని కూడా సమావేశంలో ప్రదర్శించారు. ప్రమాద స్థలంలో పాస్టర్ ప్రవీణ్ ద్విచక్ర వాహనానికి దగ్గర్లో ఎటువంటి వాహనాలూ వెళ్లకపోవడం స్పష్టంగా కనబడిందని తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు పురోగతిని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్నారని చెప్పారు. దర్యాప్తులో

మిగతా 7లో

# మళ్లీ పేలిన తూటా

## ఛత్తీస్‌గఢ్‌లో 17 మంది మావోయిస్టులు మృతి

**రాయ్‌పూర్ :** ఇటీవలి కాలంలో మావోయిస్టులకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో శనివారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో 17 మంది మావోయిస్టులు మరణించారు. నక్సల్స్ కోసం గాలింపు జరుపుతుండగా సుక్మా పోలీస్ స్టేషన్ పరిధిలోని కెర్లాపాల్ ప్రాంతంలో వారు తారసపడ్డారని, ఈ సందర్భంగా ఎదురు కాల్పులు జరిగాయని సుక్మా ఎస్‌పి కిరణ్ చవాన్ తెలిపారు. జిల్లా రిజర్వ్ గార్డులు (డిఆర్‌జి), కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సిఆర్‌పిఎఫ్) సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయని ఆయన చెప్పారు. 'ఎన్‌కౌంటర్‌లో మరణించిన 17మంది మావోయిస్టులలో 11 మంది మహిళలు. నలుగురు జవాన్లకు స్వల్పంగా గాయాలయ్యాయి' అని తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతంలో కొందరు నక్సల్స్ సంచరిస్తున్నారని సమాచారం అందడంతో భద్రతా దళాలు శుక్రవారం రాత్రే అక్కడికి బయలు దేరాయని, శనివారం ఉదయం కాల్పులు మొదలయ్యాయని ఆపరేషన్‌లో పాలుపంచుకున్న ఓ అధికారి తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం భద్రతా దళాలు అటవీ ప్రాంతంలో గాలింపు కొనసాగిస్తున్నాయి. మరి కొందరు నక్సల్స్ కూడా ఆ ప్రాంతంలో దాక్కొని ఉండవచ్చునని అనుమానిస్తున్నాయి. నక్సల్స్ ప్రభావం అధికంగా ఉన్న బస్తర్ డివిజన్‌లోనే సుక్మా జిల్లా ఉంది. ఇటీవలి కాలంలో అక్కడ భద్రతా దళాలు, నక్సల్స్ మధ్య ఎదురు కాల్పుల ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ఈ జోన్‌ను అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా అధికారులు గుర్తించారు. నక్సలిజంను నిర్మూలిస్తామని అమిత్ షా పదే పదే చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఈ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడం గమనార్హం. వారం రోజుల క్రితం ఆయన పార్లమెంటులో కూడా ఇదే విషయాన్ని చెప్పారు. 'నక్సలిజంపై మరో దాడి జరిగింది. మన భద్రతా దళాలు నక్సల్స్‌ను మట్టుపెట్టాయి. సుక్మా ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 2026 మార్చి 31 లోగా నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మేము కృతనిశ్చయంతో ఉన్నాం' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.



## 5న రాష్ట్ర సదస్సు

- విఆర్ఎల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ.. ఏప్రిల్ 5న రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఎ) సంఘం వెల్లడించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గట్టు వెంకటన్న, కె ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విఆర్ఎలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలని, నిబంధనలకు విరుద్ధంగా వేసిన నైట్ డ్యూటీలను ఆపాలని, విఆర్ఒ, అటెండర్, వాచ్‌మెన్ రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టుల్లో అర్హులైన విఆర్ఎలకు ప్రమోషన్లు ఇవ్వాలని, అటెండర్, వాచ్‌మెన్ ప్రమోషన్లలో 70 శాతం పోస్టులు విఆర్ఎలకు కేటాయించాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని ఏళ్ల తరబడి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు హాజరవుతారని, విఆర్ఎలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ముస్లిములకు జగన్ రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణకు దాతృత్వానికి రంజాన్ ప్రతీకని మాజీ సిఎం జగన్ తెలిపారు. సోమవారం రంజాన్ నేపథ్యంలో ముస్లిములకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణ దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసం విశిష్టతని పేర్కొన్నారు. పవిత్ర దివ్యఖురాన్ అవతరించిన ఈ నెలలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ముగింపు వేడుకని తెలిపారు. మనిషిలోని చెడు భావాలను, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే అతిపెద్ద పండగ రంజాన్ అని పేర్కొన్నారు.

## తిరుపతిలో ఓ కుటుంబం కిడ్నాప్

- కారు దూకి తప్పించుకున్న భర్త
- ముమ్మరంగా పోలీసులు గాలింపు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

డబ్బుల కోసం ఓ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన ఉదంతం తిరుపతిలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...తిరుపతి జీవకోనకు చెందిన రాజేష్ మీ సేవ కేంద్రం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. తల్లి విజయ, భార్య సునీత, పెద్ద కుమార్తె మోక్షిత, చిన్న కుమార్తె జాన్వితతో కలిసి ఉంటున్నారు. జీవనకోనలోని రాజేష్ ఇంటికి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ముసుగు వేసుకుని వచ్చి కత్తులతో బెదిరించి వారందరినీ ఓ అపార్టుమెంట్‌లో బంధించారు. తమకు రూ. రెండు కోట్లు డబ్బులు ఇవ్వాలని కిడ్నాపర్లు బెదిరించారు. తన దగ్గర డబ్బులు లేవని, చిత్తూరులో తమ బంధువులు ఉన్నారని, అక్కడకు తీసుకెళితే డబ్బులు తీసిస్తామని చెప్పి కిడ్నాపర్లను రాజేష్ దారి మళ్లించారు. శనివారం రాజేష్ కుటుంబ సభ్యులందరినీ కిడ్నాపర్లు ఓ కారులో ఎక్కించుకుని చిత్తూరుకు వెళ్తున్న క్రమంలో దారి మధ్యలో ఐతేపల్లి వద్ద కారు డోర్ తెరచి రాజేష్ కిందకు దూకేశారు. తీవ్ర గాయాలపాలైన రాజేష్ స్థానికుల సాయంతో రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కిడ్నాపర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి డోలాకు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె అనూరాధ, ఎం గురుస్వామి శనివారం లేఖ రాశారు. ఉద్యోగులను వారి మాతృశాఖలకు అప్పజెప్పి నిర్దిష్ట ప్రమోషన్ ఛానల్ ప్రకటించాలని కోరారు. అన్ని శాఖల ఉద్యోగుల సీనియార్టీ జాబితాను ప్రకటించి అర్హులైన వారికి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని తెలిపారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆలస్యంగా జరపడం వల్ల నష్టపోయిన 9 నెలల వేతనాలను ఎరియర్స్ రూపంలో చెల్లించాలని, జాయినింగ్ తేదీ నుంచి సర్వీస్‌ను లెక్కించి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. జిఓ 423ను రద్దు చేసి పర్యావరణ, శానిటరీ కార్యదర్శులను మిగిలిన ఉద్యోగుల్లా నిర్దిష్ట పనివేళలు కేటాయించి, జాబ్ చార్ట్‌కు అనుగుణంగా అటవీ, పర్యావరణ శాఖ, వైద్య, ఆరోగ్య, పర్యావరణ శాఖలకు కేటాయించాలని తెలిపారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సొంత జిల్లాలకు వెంటనే బదిలీ చేయాలని కోరారు.

## తప్పిపోయిన మహిళలు, బాలికలను తీసుకురండి

- బిజెపి నాయకులు యామిని శర్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో కనపడకుండా పోయిన వందలాది మంది మహిళలు, బాలికలను త్వరగా తీసుకురావాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ కోరారు. ఈ మేరకు డిజిపి హరీష్ కుమార్ గుప్తాను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. వైసిపి హయాంలో వేలాది మంది మహిళలు, బాలికలు కనపడకుండా పోయారని తెలిపారు. ఇద్దరు మహిళలు హోంమంత్రులుగా ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

# ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నెల్లూరు



నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజా సమస్యలను పరిష్కరించకుండా టిడిపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విఆర్‌సి క్రీడా మైదానం నుంచి మహా ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు చేసేది ఒక్క సిపిఎం మాత్రమేనని, మరే ఇతర రాజకీయ పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన దాఖలాలు లేవన్నారు.

అధికారంలోకి రాక ముందు ఇంటింటికి తిరిగిన రాజకీయ నాయకులు.... అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సమస్యల పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నాలూ చేయడం లేదని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నెల రోజులుగా ప్రజా చైతన్య యాత్రలు చేపట్టి, ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో తమకు పనిలేదని, పథకాలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి, అత్యంత మెజార్టీ ఇచ్చి అధికారాన్ని కట్టబెట్టిన టిడిపి కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్రమైన నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడిన పది మాటల్లో తొమ్మిది మాటలు కార్పొరేట్ కంపెనీల గురించి మాత్రమే ఉంటున్నాయన్నారు. చట్ట ప్రకారం భూమిని తీసుకున్న ఐదేళ్లలో పరిశ్రమలు స్థాపించకపోతే ఆ భూములు ప్రభుత్వం వెనక్కుతీసుకోవాల్సి ఉందన్నారు. ఇలా ఎక్కడా భూములు వెనక్కు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సిపిఎం సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, ఎస్‌కె.రెహనాబేగం, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## భావ ప్రకటనా స్వేచ్ఛ పై దాడిని ఖండించండి

- కునాల్ కమ్రాకి సంఘీభావంగా పిఎన్ఎం రౌండ్ టేబుల్ భేటీ

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

ఇటీవల ముంబైలో స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా పై జరుగుతున్న దాడిని ఖండించాలని, దాడికి పాల్పడిన బిజెపి, శివసేన (షిండే) మూకలపై చర్యలు తీసుకోవాలని ప్రజానాట్యమండలి (పిఎన్ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన రౌండ్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విజయవాడ సున్నపు బట్టీల సెంటర్లోని పూలే-అంబేద్కర్ భవన్లో నిర్వహించిన కార్యక్రమంలో పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నాయకులు సంపర శ్రీనివాసరావు మాట్లాడుతూ భావ ప్రకటనపై దాడిని భారత రాజ్యాంగం మీద దాడిగా అభివర్ణించారు. విమర్శించిన వారిపై దాడులు చేయడం, కళారూపాలపై నిషేధాలు విధించడం ప్రజాస్వామ్య దేశంలో హేయమైన విషయమన్నారు. మహారాష్ట్ర లో పార్టీ ఫిరాయించిన ఉప ముఖ్యమంత్రిని ద్రోహి అంటూ కునాల్ కమ్రా స్టాండప్ కామెడీ చేసిన స్టుడియోని ధ్వంసం చేయడం విడ్డూరమన్నారు. కార్టూన్ వేయడం, స్టాండప్ కామెడీతో విమర్శలు చేయడం కళాకారుల సహజమైన హక్కు అన్నారు. ప్రజలందరూ ఇటువంటి దాడులకు వ్యతిరేకంగా గళం విప్పాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను అణచాలని చూసిన పాలకులు చరిత్ర హీనులయ్యారన్నారు. ప్రశ్న, తర్కం ఉంటేనే సమాజం ముందుకు పోతుందన్నారు. కునాల్ కమ్రా లాంటి వారికి కవులు, కళాకారులు, మేధావులు అండగా నిలవాలని కోరారు. సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు సాహితీ వేత్త వొరప్రసాద్ మాట్లాడుతూ కళాకారుల గళాలకు, కలాలకు సంకెళ్ల వేయాలని చూస్తున్న పాలకుల దుర్మార్గాలపై మరింత పదునుగా కవితలు, పాటలతో పాటు అనేక రకాల పద్ధతుల్లో ప్రజల్ని చైతన్య పరచాలని పిలుపు నిచ్చారు. అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్.పి.రామరాజు మాట్లాడుతూ మంచి వారి మౌనం సమాజానికి హానికరమన్నారు. ఇటువంటి ఘటనలపై సభ్య సమాజం స్పందించాలని, దాడులకు వ్యతిరేకంగా నినదించాలన్నారు. కామ్రేడ్ జిఆర్కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు మాట్లాడుతూ నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, గౌరీ లంకేష్ లపై దాడులకు పాల్పడిన దుండగులపై అప్పుడే చర్యలు తీసుకొని ఉంటే కొంత మేరకైనా ఇటువంటి దాడులు జరగకుండా ఉండేదన్నారు.సమావేశానంతరం అమ్మ కళ్యాణ మండపం జంక్షన్ లో భావ ప్రకటనా స్వేచ్ఛ ని కాపాడాలని, కునాల్ కమ్రాపై పై దాడిని ఖండించాలని నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి, ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, అరసం నాయకులు మోతుకూరి అరుణ్, రైతు నాయకులు ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.లెనిన్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కె.ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి

- మంత్రి అచ్చెన్నకు రైతు, కౌలు రైతు సంఘాల వినతి


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోకో, మిర్చి, పొగాకు, ధాన్యం రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం నాయకులు కోరారు. రైతుల సమస్యలను వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. గతేడాది కోకో గింజలు కిలో రూ.1000 అమ్ముడుపోయాయని, ఈ ఏడాది సగం ధరకు కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో ధరలకు ఇక్కడ గింజలు కొనే ఏర్పాటు చేయాలని, లేదా రాష్ట్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా రూపొందించిన మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. కనీస ధర రూ.15 వేలు క్వింటాలుకు నిర్ణయించి దానికి తగ్గిన ధర వ్యత్యాసం రైతులకు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ప్రస్తుతం అమ్ముకునే వారికి, గతంలో అమ్ముకున్న రైతులకు కూడా ఈ పథకం మార్చి అమలు చేయాలని కోరారు. బ్లాక్‌బెర్లి పొగాకు కొనుగోలు గతేడాది రేట్లకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో సిద్ధమవుతున్న సుమారు 15 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. కౌలు రైతుల చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. మంత్రిని కలిసిన వారిలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కె అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, ఉపాధ్యక్షులు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# సర్దుబాటు పేరుతో జనంపై భారాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు
- సింగ్‌నగర్, రాణీగారితోట విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న బాబూరావు, తదితరులు

విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం మీద టిడిపి కూటమి సర్కార్ భారాలు మోపుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. విద్యుత్ భారాలపై సింగ్‌నగర్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేసి, విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ... రూ.15,485 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారాన్ని తొమ్మిది నెలల్లో ప్రజలపై ప్రభుత్వం మోపిందన్నారు. విద్యుత్ సుంకాన్ని.. చిన్న, మధ్య తరగతి వ్యాపారులపై యూనిట్‌కు ఆరు పైసల నుంచి వంద పైసలకు భారం పెంచిదని వివరించారు. విద్యుత్ బిల్లులు పెరిగి జనం గగ్గోలు పెడుతున్నా, ఛార్జీలు పెంచలేదని ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసగిస్తున్నారని విమర్శించారు. అదానికి మేలు చేయడం కోసం మోడీ ఒత్తిళ్లకు తలొగ్గి గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని కుదుర్చుకుందని, స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని ఎన్నికలకు ముందు లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. నేడు అదే టిడిపి కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను శరవేగంగా బిగిస్తోందని తెలిపారు. సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరిట ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాణీగారితోట విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. విద్యుత్ భారాలను నిలువరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ హెచ్చరించారు.

# మొక్కుబడిగా 'పబ్లిక్ గ్రీవెన్స్'

- 78 శాతం మంది అసంతృప్తి
- 90 శాతం పరిష్కారమంటూ ప్రభుత్వం లెక్కలు
- 9 నెలల్లో 8.26 లక్షల దరఖాస్తులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడి తంతులా ఉంది. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించకుండానే పరిష్కరించామని లెక్కలు చూపుతోంది. వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటిని అసలు ఆడిట్ కూడా చేయలేదంటే ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వానికి, అధికారులకు ఉన్న బాధ్యత ఏమిటో అర్థమవుతోంది. సమస్య పరిష్కారం కాకపోయినా ప్రభుత్వం నుంచి పరిష్కరించినట్లు సందేశాలు రావడంతో ఫిర్యాదుదారులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఒకచోట పరిష్కారం దొరక్కపోవడంతో కూటమి పార్టీలు తమ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌ల చుట్టూ ప్రజలు తిరుగుతున్నారు. టిడిపి కార్యాలయంలో, జనసేన కార్యాలయంలో, బిజెపి కార్యాలయంలో నిర్వహించినా, విద్యాశాఖ మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించినా ప్రజల ఫిర్యాదుల పట్ల ప్రభుత్వానికి లెక్క లేకుండా పోతుందని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రూపాల్లో ప్రభుత్వానికి 8,26,099 ఫిర్యాదులు అందాయి. రీసర్వే గ్రామ సభలు ద్వారా 2,59,642 దరఖాస్తులు, రెవెన్యూ సదస్సుల ద్వారా 2,34,944 దరఖాస్తులు, ప్రతి జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆయా జిల్లా కలెక్టర్లు సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ ద్వారా 99,510, మండల స్థాయిలో నిర్వహించే పిజిఆర్ఎస్ ద్వారా 72,403, ఆన్‌లైన్ ద్వారా 52,475, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రుల ద్వారా 19,581, ఎస్‌పి కార్యాలయాల నుంచి 14,889, ముఖ్యమంత్రి రాష్ట్ర కేంద్రంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ ద్వారా 10,664, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ప్రజాదర్బార్ ద్వారా 9,610, ఇతర 18,734 చొప్పున దరఖాస్తులు అందాయి. 2024 జూన్ 15 నుంచి ఈ నెల 15 వరకు 8,26,099 ఫిర్యాదులు అందితే, వీటిలో 7,45,501 పరిష్కరించామని ప్రభుత్వం లెక్కలు తేల్చింది. అందిన ఫిర్యాదుల్లో 1,73,020 ఆడిటే పూర్తిచేయకుండా పూర్తిచేసినట్లు లెక్కలు చెబుతోంది. మరోపక్క వీటిల్లో 29,400 ఫిర్యాదులను మరలా ఓపెన్ చేసినట్లు చెబుతోంది.

### బలవంతంగా ఫిర్యాదులు మూసివేత

ఫిర్యాదులను న్యాయబద్ధంగా పరిష్కరించకుండా బలవంతంగా వాటిని రాజీ కుదిర్చి ఆ ఫిర్యాదును బలవంతంగా మూసివేసేలా చూస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అనంతపురం జిల్లాలోని ఎటిపి 20241026350 నెంబర్ గల ఫిర్యాదులో ఇలానే జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక అందింది. ఫిర్యాదుదారుడు ఆమోదం లేకుండానే మూసివేశారని ఎన్‌టిఆర్, అన్నమయ్య జిల్లాల్లో గుర్తించింది.

### ఐవిఆర్ఎస్‌లో 78 శాతం అసంతృప్తి

పిజిఆర్ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం 1100 ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. పరిష్కారం పూర్తయినట్లు చెబుతున్న 33,538 మందిలో 15,953 మందికి ఫోన్ చేసి వారి అభిప్రాయాలు సేకరించింది. ఈ సేకరణలో కేవలం 3,515 మంది అంటే 22 శాతం మంది మాత్రమే ఫిర్యాదుల పరిష్కారం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన 12,438 (78 శాతం) ఫిర్యాదుల పరిష్కారం పట్ల అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తోంది. వీటిల్లో సిఎం నేరుగా రాష్ట్ర కేంద్రంలో స్వీకరించిన 6,542 ఫిర్యాదుదారుల నుంచి అభిప్రాయం సేకరించారు. వీరిలో కేవలం 1,293 మంది సంతృప్తి వ్యక్తం చేయగా, 80 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాల్లో స్వీకరించిన ఫిర్యాదుదారుల్లో 71 శాతం, సిఎం కార్యాలయం ద్వారా అందించిన ఫిర్యాదుదారుల్లో 81 శాతం మంది ఫిర్యాదులు పరిష్కారంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి రాష్ట్ర కేంద్రంలో స్వీకరించిన ఫిర్యాదుదారుల్లో 81 శాతం మంది, జిల్లాల్లో స్వీకరించిన వారిల్లో 90 శాతం మంది అసంతృప్తిగా ఉన్నారు. మంత్రి నారా లోకేష్ స్వీకరించిన ఫిర్యాదుదారుల్లో 81 శాతం మంది అసంతృప్తిగా ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వంశీకి రిమాండ్

- విజయవాడ జిల్లా జైలుకు తరలింపు
- కంకిపాడు పోలీస్‌స్టేషన్‌లో విచారణ

ప్రజాశక్తి - కంకిపాడు, గన్నవరం :

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు భూ కబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పోలీసులు శనివారం తమ కస్టడీకి తీసుకున్నారు. ముందుగా గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై దాడి కేసులో ప్రస్తుతం విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కంకిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి వంశీని పోలీసులు ప్రశ్నించారు. వంశీ వ్యక్తిగత న్యాయవాది సమక్షంలో గన్నవరం డిసిపి చలసాని శ్రీనివాసరావు పర్యవేక్షణలో హనుమాన్ జంక్షన్ సిఐ సత్యనారాయణ ఆయనను విచారించారు. విచారణ అనంతరం గన్నవరం కోర్టులో వంశీని హాజరుపరిచారు. ఏప్రిల్ ఎనిమిది వరకు వంశీకి రిమాండ్ విధించడంతో విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ భూ వివాదానికి సంబంధించి శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదుతో ఉంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో వంశీపై కేసు నమోదైన కేసుకు సంబంధించి గన్నవరం కోర్టు శుక్రవారం ఒకరోజు పోలీస్ కస్టడీకి అనుమతించింది.

### భూ దందా వ్యవహారం నాకు తెలియదు... శ్రీధర్ రెడ్డి నా దగ్గరకు రాలేదు : వంశీ

"తేలప్రోలు గ్రామంలో భూముల దందా వ్యవహారం నాకు తెలియదు.. శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి నా దగ్గరకు రాలేదు... అతనితో నాకు పరిచయం లేదు.. నేను ఏ విధమైన భూ పంచాయితీ చేయలేదు.. కావాలని నన్ను కేసులో పెట్టారు.." అని వంశీ పోలీసులు విచారణ చెప్పినట్లు తెలిసింది. "నాకు తెలిసిన విషయాలే చెబుతా.. తెలియని విషయాలు చెప్పలేను... కొన్ని గుర్తులేవు" అని సమాధానం ఇచ్చినట్లు సమాచారం.


తిరుపతి సుందరయ్యనగర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

## 'మత సామరస్యం' కోసం తిరుపతి-మదురై సైకిల్ యాత్ర

- 71 ఏళ్ల వయస్సులో సాహస యాత్ర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మత సామరస్యం కోసం పోరాడాలని, మదురైలో ఏప్రిల్ 2 నుండి 6వ తేదీ వరకూ జరగనున్న 24వ సిపిఎం అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం చిత్తూరు జిల్లా పూర్వ కార్యదర్శి చల్లా వెంకటయ్య, జెవివి నాయకులు కుప్పస్వామి శనివారం సైకిల్ యాత్రగా బయలుదేరారు. మండుటెండలో ఈ సాహసయాత్ర చేపట్టారు. తిరుపతి యశోదానగర్‌లోని సుందరయ్యనగర్ కూడలిలో సైకిల్ యాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరం మతసామరస్యానికి పేరని, అటువంటి నగరం నుంచి తమిళనాడులోని మదురై వరకూ యాత్రకు పూనుకోవడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా చల్లా వెంకటయ్య 71 ఏళ్ల వయస్సులో ఈ యాత్రలో పాల్గొనడం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య విభేదాలు సృష్టించి దేశాన్ని మతప్రాతిపదికన విభజించాలని చూస్తోందన్నారు. మతోన్మాదశక్తులు కార్పొరేట్ శక్తులతో మమేకమై దేశాన్ని దోచుకుంటూ ప్రజలపై భారాలను మోపుతున్నాయన్నారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి ప్రజలను హింసిస్తున్నాయని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల మీదుగా ఈ యాత్ర తమిళనాడులోని వేలూరు జిల్లాలో ప్రవేశించి అక్కడ నుంచి మదురై చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె వేణుగోపాల్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర, డాక్టర్ పి. సాయి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కంపెనీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

## 'క్రెబ్స్' అక్రమ లే ఆఫ్‌పై కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కశింకోట (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని క్రెబ్స్ బయో కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రకటించిన అక్రమ లే ఆఫ్‌ను ఎత్తేయాలంటూ క్రెబ్స్ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు శనివారం కంపెనీ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎవి.అప్పారావు, బాబూరావు, కన్నబాబు, గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు జి.కోటేశ్వరరావు మాట్లాడారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం లే ఆఫ్‌ను ప్రకటిస్తున్నామని, పవర్ సరఫరా ఆగిపోవడం వల్ల కంపెనీ నడిచే పరిస్థితి లేదని పేర్కొంటూ కంపెనీ యాజమాన్యం ఏప్రిల్ 1 నుంచి లే ఆఫ్‌ను ప్రకటించడం తగదన్నారు. యాజమాన్యం, కార్మిక సంఘం మధ్య జరిగిన వేతనాలు, ఇతర అంశాలకు సంబంధించిన అగ్రిమెంట్ మార్చితో పూర్తవుతుందని, ఇటువంటి సమయంలో అక్రమ లే ఆఫ్ వల్ల కార్మిక కుటుంబాలు రోడ్డున పడతాయని తెలిపారు. క్రెబ్స్ యజమాన్యం గతంలోనూ చట్టవిరుద్ధంగా లే ఆఫ్‌ను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికుల పోరాటంతో తిరిగి కంపెనీని అప్పట్లో తెరిచారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, అప్పారావు, జాజుల శ్రీనివాస్, నాగేశ్వరరావు, నూక నాయుడు, త్రినాధరావు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో తిరువూరు ఎమ్మెల్యే పంచాయితీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ అంశం మరోసారి టిడిపి కార్యాలయానికి చేరింది. తిరువూరు నియోజకవర్గానికి చెందిన సొంత పార్టీ నేత అలవాల రమేష్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే 48 గంటల్లో రాజీనామా చేస్తానని కొలికపూడి శ్రీనివాస్ పార్టీ అధిష్టానానికి సవాల్ విసిరారు. ఈ అంశంపై పార్టీ అధిష్టానం పార్టీ సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజు, మాజీ మంత్రి నెట్టెం రఘు, విజయవాడ ఎంపి కేశినేని చిన్ని ఆధ్వర్యంలో కమిటీని నియమించింది. ఇదే అంశంపై కొలికపూడి శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ నేత అలవాల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు మంగళగిరి పార్టీ కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. కొలికపూడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యాలయంలో ఉన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కార్యకర్తలను సముదాయించారు. ఆ నియోజకవర్గానికి చెందిన ముఖ్యనేతలతో సుమారు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. చర్చల అనంతరం పల్లా మీడియాతో మాట్లాడుతూ.. తిరువూరు నియోజకవర్గానికి కొత్త ఇన్‌చార్జ్‌ను ప్రకటించాలని కొంతమంది, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకునేందుకు కమిటీని నియమించాలని కొంతమంది కోరారని చెప్పారు. ఈ అంశాలను తమ పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పార్టీ గీత దాటితే ఎవరినీ ఉపేక్షించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యకర్తలు, నాయకులను ఎమ్మెల్యేలు సమన్వయం చేసుకొని వెళ్లాలని సూచించారు.

## వివేకా హత్యకేసులో సాక్షుల మృతిపై సిట్ విచారణ

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీమంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందుతుండడంతో సిట్ విచారణ చేపట్టింది. 2019 సెప్టెంబరు రెండున అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సింహాద్రిపురం మండలం కసనూరుకు చెందిన కటికరెడ్డి శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులను శనివారం పులివెందుల డిఎస్‌పి కార్యాలయంలో సిట్ బృందం విచారించింది. వివేకా హత్య కేసులో శ్రీనివాసులురెడ్డి కీలక సాక్షిగా ఉన్నారు. వివిధ పరిణామాలపై విడివిడిగా ఆరుగురిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని తీసుకుంది.

## స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి అక్రమాలకు అధికారుల వంత

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి అక్రమాలకు అధికారులు వంత పాడారని ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం మౌనం వహిస్తోందని మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇసి వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి చేటని అన్నారు. ఉప ఎన్నికల అక్రమాలపై ఇసి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఎం సొంత నియోజకవర్గంలోనూ ప్రజాస్వామ్యానికి పాతర వేశారని పేర్కొన్నారు. బలవంతంగా టిడిపి కండువాలు కప్పి తమ పార్టీవారేనని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. బలం లేనిచోట కూడా అధికార పార్టీ నాయకులు అభ్యర్థులను నిలబెట్టి దౌర్జన్యం చేశారని, అరాచకాలతో పదవులు దక్కించుకునేందుకు తెగబడ్డారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. పలుచోట్ల వైసిపి అభ్యర్థులపై దాడులు చేశారని, వారి ఆస్తులను ధ్వంసం చేశారని, తప్పుడు కేసులు బనాయించారని తెలిపారు. వారి బంధువులపైనా పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. రామకుప్పంలో ఎంపిటిసిలు వచ్చే రోడ్లకు అడ్డంగా చెట్లను నరికి వేశారన్నారు. రామగిరిలో టిడిపి ఎమ్మెల్యే పరిటాల సునీత.. పోలీసులతో ఎంపిటిసిలను బెదిరించారని తెలిపారు. పల్నాడు జిలా అచ్చెంపేట, విడవలూరు, పొద్దుటూరులోనూ ఎంపిటిసిలను బెదిరించి వారి పార్టీలోకి లాక్కున్నారని తెలిపారు. వారి గెలుపు వీలుకాని చోట వాయిదా వేయించారని ఆరోపించారు.

# గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలి

- పార్వతీపురం ఐటిడిఎను ముట్టడించిన గిరిజనులు



పార్వతీపురం ఐటిడిఎ పిఒ ఛాంబర్ వద్ద బైఠాయించిన గిరిజనులు, సిపిఎం, గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జీడీ, చింతపండు, చీపుర్లు తదితర గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, గ్రామాలకు రోడ్లు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన శనివారం పార్వతీపురం ఐటిడిఎను గిరిజనులు ముట్టడించారు. వీరి పోరాటానికి సిపిఎం మద్దతు తెలిపింది. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో గిరిజనులంతా ఐటిడిఎ పిఒ ఛాంబర్ వద్ద బైఠాయించారు. కొద్దిసేపటి తరువాత అక్కడికి వచ్చిన ఎపిఒకు గిరిజనుల సమస్యను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, రైతు సంఘం మన్యం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, కె.రామస్వామి వివరించారు. అంతకుముందు ధర్నానుద్దేశించి నాయకులు మాట్లాడుతూ... పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల ఎనిమిది మండలాల్లో గిరిజనులు సాగు చేస్తున్న జీడి పంటతో పాటు ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కురుపాం, సాలూరు, సీతంపేట మండలాల్లో జీడి పిక్కల పరిశ్రమ, ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి 80 కేజీల జీడి బస్తా రూ.16 వేలకు కొనుగోలు చేయాలని, అన్ని గిరిజన గ్రామాలకూ బస్సు, రోడ్డు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని, నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు ఇచ్చి అన్ని విధాలా భరోసా ఇవ్వాలని కోరారు. సాలూరు, కురుపాం, సీతంపేటలో వంద పడకల ఆస్పత్రులను నిర్మించాలని, 3, 4, 5 తరగతుల విద్యార్థులను చదువుకు దూరం చేసే మోడల్ స్కూల్ విధానాన్ని నిలిపివేయాలని, చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేసి గిరిజన రైతులకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. ఎపిఒ మురళీధర్ స్పందిస్తూ.. ఇప్పటికే వెలుగు తదితర శాఖల నుంచి నిధులు కేటాయించి జీడి ప్రాసెసింగ్ చేసే చర్యలు చేపడుతున్నామన్నారు. ఇతర సమస్యలపై పిఒతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గిరిజనులు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వై.నాయుడు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, కె.ఈశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్రి శ్రీను తదితరులు మద్దతు తెలిపారు. సీతంపేట ఐటిడిఎ కార్యాలయం వద్ద కూడా గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, బిడ్డిక సుందరమ్మ మాట్లాడారు.

## వైసిపి నాయకుల నుంచి ప్రాణహాని

- వివేకా హత్య కేసు నిందితుడు సునీల్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : వైసిపి నాయకుల నుంచి తనకు ప్రాణహాని ఉందని మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు సునీల్ యాదవ్ చెప్పారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తనపై అనేక ఆరోపణలు చేశారన్నారు. తాను కోట్ల రూపాయలు సంపాదించానని చెబుతున్నారని, ఆ రూ.కోట్లు ఎక్కడున్నాయో నిరూపించాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. 'హత్య' సినిమాపై పోలీసులకు ఆశ్రయించడంలో తప్పేముందన్నారు. సినిమాలో నలుగురిని మాత్రమే చూపించారని మరో నలుగురైన ఉదయ్ కుమార్‌రెడ్డి, వైఎస్.భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, వైఎస్.అవినాష్‌రెడ్డిలను ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. సినిమా తీయించింది ఎవరో త్వరలో తెలుస్తుందని, సినిమాపై కేసు పెడితే వైసిపి నాయకులు ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

## 'స్మార్ట్ మీటర్లు మా ఇంటికి వద్దు'

- సిపిఎం ఆధ్వర్యంలో పోస్టర్ల ప్రచారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు భారమైన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ అనంతపురం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. 'స్మార్ట్ మీటర్లు మా ఇంటికి వద్దు' అంటూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఆటోలకు స్టిక్కర్లు అంటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వివిధ పేర్లతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగలగొట్టాలంటూ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ విధానాలనే వీరూ అవలంభిస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించేంత వరకూ ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, ఇర్ఫాన్, సిఐటియు నాయకులు మగ్బుల్ బాషా, భాస్కర్ పాల్గొన్నారు.

సంపాదకీయం


# మహా విపత్తు

**భూ**కంపం మనిషి జ్ఞానాన్ని పరిహసించే ప్రకృతి విపత్తు. 'మానవ అహంకారం ప్రపంచాన్ని త్యాగం చేస్తుందా? ఆడంబరమైన గృహాల పట్ల దాని కోరికను తీర్చుకోడానికి? బట్టతలలా వున్న ఆ గోళాన్ని సుదూర అంతరిక్షం చూస్తుందా? ఇప్పుడు ఆ భూమాత చెప్పేది నాకు వినబడుతోంది/ నన్ను ఒకప్పుడు భూమి అని పిలిచేవారు/ కానీ ఇప్పుడు, ఆనందం లేకుండా ఏడుస్తున్నాను/ చెట్లు లేని గోళం ఇకపై భూమి కాదు' అంటారు కవి గర్విట్. మయన్మార్, థాయ్‌లాండ్‌ను శుక్రవారం రెండు భారీ భూకంపాలు వణికించాయి. శనివారం మరోసారి భూప్రకంపనలు రావడంతో ప్రజలు భీతిల్లారు. రిక్టార్ స్కేల్ మీద ఈ భూకంపాల తీవ్రత 7.7, 6.8గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ వెల్లడించింది. ఈ పెను విపత్తులో మృతుల సంఖ్య పదివేలు దాటే అవకాశం వుందని అమెరికా ఏజెన్సీ హెచ్చరించింది. పెద్దఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం సంభవించడంతోపాటు, వందల సంఖ్యలో భారీ భవనాలు, ప్రార్థనాలయాలు, సాధువుల మఠాలు పేకమేడల్లా కుప్పకూలాయి. శిథిలాల కింద చిక్కుకుని అనేకమంది విలవిల్లాడుతున్నారు. రెండు దేశాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు అత్యయిక పరిస్థితిని ప్రకటించాయి. మయన్మార్‌లోని మాండలే నగరంలో అత్యధిక ప్రాణనష్టం సంభవించగా, ఐకానిక్ అవ బ్రిడ్జ్ పక్కనే వున్న ఇర్రవడ్డి నదిలో కూలిపోయింది. మయన్మార్‌లో 1946 తర్వాత ఇదే అతి తీవ్రమైన భూకంపం. ఈ ప్రభావం భారత్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లోనూ కనిపించింది.

'భూకంపాలు ప్రజలను చంపవు... భవనాలు చంపుతాయి' అంటాడు జపాన్‌కు చెందిన ప్రసిద్ధ ఆర్కిటెక్ట్ షిగేరు బాన్. ప్రకృతిని మనం గౌరవించనంత కాలం ఇలాంటి వైపరీత్యాలు తప్పవు. భూ వైజ్ఞానిక పరిశోధనల ప్రకారం.. టిబెట్ పీఠభూమి ప్రాంతంలో సంక్లిష్టమైన టెక్టానిక్ పలకలపై వున్నందున మయన్మార్‌కు భూకంప ముప్పు ఎక్కువ. ఇక్కడి టెక్టానిక్ పలకలు ఏటా 0.7 అంగుళాల చొప్పున పరస్పర వ్యతిరేక దిశలో కదులుతున్నాయి. ఫలితంగా పుట్టుకొచ్చే ఒత్తిడి భూకంపాలుగా మారుతుంటుంది. ఇక్కడ దశాబ్దానికొక్క భారీ భూకంపం నమోదవుతోంది. అయితే సహజమైన ఈ కారణాలతో పాటు మానవ కార్యకలాపాలు కూడా భూలోపలి పొరలపై తీవ్రమైన ఒత్తిడి రాజేసి ప్రకంపనలకు కారణమవుతున్నాయని భూ విజ్ఞాన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భారీ నీటి నిల్వ ప్రాజెక్టులు, గనుల తవ్వకాలతో పాటు నానాటికీ పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, భూతాపం, అడవుల విధ్వంసం, నాగరికత పేరిట నిర్మిస్తున్న ఆకాశహర్మ్యాలు ప్రకృతి వినాశనానికి కారణమౌతున్నాయి. సముద్ర మట్టాలు పెరగడానికి, భూమి లోపలి పొరలను బలహీనపర్చడానికి దారితీసే ముప్పును వేగవంతం చేస్తున్నాయి. బలహీనమైన కట్టడాలు, బహుళ అంతస్తుల భవనాలు ఈ ముప్పు నుంచి బయటపడే మార్గాలను మూసేస్తున్నాయి.

'భూమాతకు గర్భశోక భారం...భూకంపం' అంటారో కవి. ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడటానికి సంసిద్ధత కీలకం. అటువంటి శోకభారాన్ని అనుభవిస్తోన్న మయన్మార్ ప్రజలకు 'మనమందరం ఒక తాటిపై నిలబడి, ఈ విలయాన్నుంచి బయటపడి భవిష్యత్తును పునర్నిర్మించుకోవాల్సి వుందని' ఆ దేశ ప్రధాని మహ్న్ విన్ పిలుపునిచ్చారు. సాయపడే ప్రతి చేయి, ప్రతి చిన్న కార్యాచరణ కూడా ఈ సమయంలో ఎంతో విలువైనవి. ప్రపంచమంతా తమ ఔదార్యం చూపాల్సిన సమయమిది. వయనాడ్ విలయం కేరళను కుదిపేసినప్పుడు... ఆ ప్రభుత్వం చేపట్టిన అత్యవసర చర్యలతో పాటు... ప్రపంచవ్యాప్తంగా మేమున్నామంటూ ఆపన్న హస్తం అందించారు. అదే ఓదార్పు, అలాంటి భరోసా నేడు మయన్మార్‌కు అవసరం. ప్రకృతి వైపరీత్యాలను మనం ఆపలేము. కానీ, జ్ఞానంతో మనల్ని మనం ఆయుధం చేసుకోవచ్చు. తగినంత సంసిద్ధత వుంటే... చాలామంది ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చేది కాదు. మయన్మార్‌కు గతంలో భూకంపాలను చవిచూసిన చరిత్ర వున్నప్పటికీ, తగిన సంసిద్ధత లేకపోవడం, పేలవమైన నిర్మాణాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, తగినంత అవగాహన లేకపోవడం కూడా ఇంత భారీ నష్టానికి కారణమైంది. స్థానిక ప్రభుత్వం అంతర్జాతీయ సమాజం సహకారంతో మయన్మార్‌ను పునర్నిర్మించాలి. ప్రకృతి మళ్లీ దాడి చేసినప్పుడు... ప్రజలను రక్షించగల సామర్థ్యం, సంసిద్ధతను మయన్మార్ ఏర్పరచుకోవాలి.

మహనీయుల మాట




**ప్రజలు వాస్తవమైన ఆనందం ఏమిటో గ్రహించిన రోజున, ఆ ఆనందాన్ని పొందడం సాధ్యమేనని తెలుసుకున్న రోజున మతం అదృశ్యమౌతుంది. అయితే పాలక వర్గాలు తమ ప్రయోజనాల రీత్యా, ప్రజలు ఆ విషయం తెలుసుకోకుండా అడ్డుపడుతుంటారు. తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి మతాన్ని ఉపయోగించుకుంటుంటారు.**

**- ఆగస్ట్ బెబెల్, జర్మన్ సోషలిస్ట్ రాజకీయవేత్త, రచయిత.**

# కాలిపోయింది నోట్ల కట్టలా? న్యాయమా?

ప్రస్తుతం



**తెలకపల్లి రవి**



**పి.వి నరసింహారావు హయాంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిని అభిశంసించేందుకు పార్లమెంటు చర్యలు తీసుకున్నా నాటి ప్రభుత్వం బయటపడేసింది. సిజెఐగా పనిచేసిన జస్టిస్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వస్తే కేంద్రం ఏ చర్యా తీసుకోలేదు. తర్వాత ఆయనకు మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ పదవి దక్కింది. బిజెపి హయాంలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఛటర్జీని కూడా అభిశంసించిన పరిస్థితి ఏర్పడితే ఆయన రాజీనామా చేసి బయటపడ్డారు. సిజెఐగా వుండగానే జస్టిస్ రంజన్ గొగోయ్ పాలనా నిర్వహణ తీరుపై సహచర న్యాయమూర్తులే తీవ్రంగా తిరగబడినా-ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు వచ్చినా సురక్షితంగా పదవీ కాలం పూర్తి చేసుకుని కొద్ది రోజులలోనే మోడీ సర్కారు నామినేషన్‌తో రాజ్యసభకు వెళ్లారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు కాషాయ నేతలూ న్యాయ వ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని చూస్తున్న నేపథ్యంలో ఉన్నత న్యాయమూర్తులే ఆరోపణలకు గురవుతున్న స్థితిలో రాజ్యాంగ స్ఫూర్తితో ఈ సవాలును ఎదుర్కొనవలసి వుంటుంది.**

**ఢి**ల్లీ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు కట్టలకొద్దీ కాలిపోయిన నోట్లు కనిపించాయనే కథనాలు దేశంలో సంచలనం కలిగించాయి. న్యాయ వ్యవస్థలో అవినీతి పెరిగిపోతున్నదనే అభిప్రాయాలు అనేక సార్లు వ్యక్తమవుతున్నా కొన్ని ఉదాహరణలు కనిపిస్తున్నా కోర్టు ధిక్కారం గురించిన సంకోచాలు, వ్యవస్థపై గౌరవం కారణంగా ఒక పరిధికి మించి అది చర్చకు రాలేదు. కానీ ఇప్పుడు మీడియాలో ఒక్కసారిగా ఈ ఉదంతం బయటికి రావడం, దానిపై నేరుగా భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా జోక్యం చేసుకుని ముగ్గురు హైకోర్టు సిజెలతో కమిటీని నియమించి విచారణ ప్రక్రియ ప్రారంభించడం, తగలబడినట్టు చెప్పబడే నోట్ల కట్టలను అత్యున్నత న్యాయస్థానమే పోస్టు చేయడం ఇవన్నీ సంచలనం కలిగించాయి. ఈ తరహా ఘటనలు గతంలో ఎప్పుడూ జరిగి వుండలేదన్నది వాస్తవం. ఇది న్యాయవ్యవస్థలో, నివేదించే మీడియాలో, పార్లమెంటులో రాజకీయ వర్గాల్లో అన్ని విధాల చర్చనీయమైంది. ఎప్పుడూ న్యాయ వ్యవస్థపై వ్యాఖ్యల్లో ముందుండే రాజ్యసభ ఛైర్మన్ ఉప రాష్ట్రపతి జగదీప్ ధంకర్ దీనిపైనా తీవ్రంగా స్పందించడమే గాక అన్ని పార్టీలతో చర్చించే బాధ్యత బిజెపి అధ్యక్షుడూ కేంద్రమంత్రి జె.పి. నడ్డాకు అప్పగించారు. అయితే గమనించాల్సినదేమంటే ఇప్పటికీ ఈ విషయమై న్యాయ వ్యవస్థ అంతర్గత పరిధిలో విచారణ ప్రక్రియ తప్ప మరే దర్యాప్తు మొదలు కాలేదు. జస్టిస్ వర్మపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయాలని కోరుతూ మాథ్యూ జె.నెడుంపర అనే సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఓకా ధర్మాసనం కొట్టి వేసింది. విచారణ గురించిన వివరాలు తెలియరాకుండా దీన్ని చేపట్టడం తొందరపాటే అవుతుందని వ్యాఖ్యానించింది. అదే సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఒక మీడియా సదస్సులో పాల్గొంటూ సిజెఐ అనుమతి లేకుండా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసే ప్రశ్న ఉత్పన్నం కాదని ప్రకటించారు. మరోవైపున సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు కేంద్రం జస్టిస్ వర్మను ఆయన మాతృ స్థానమైన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసింది. కాని వర్మకు న్యాయపరమైన బాధ్యతలు అప్పగించవద్దని అంతకు ముందు ఢిల్లీ హైకోర్టు సిజెను ఇప్పుడు అలహాబాద్ హైకోర్టు సిజెను కూడా ఆదేశించారు. సంచలన వార్తలు వచ్చాక అత్యున్నత జోక్యం తర్వాత కూడా జరుగుతున్నదేమిటనేది గానీ, ఏం చేయబోతున్నారనేది గాని స్పష్టత లేని పరిస్థితి ఏర్పడింది.

**తప్పులకు రక్షణలు**

జస్టిస్ వర్మ ఉదంతంలో కోర్టుల మల్లగుల్లాలు ఒకటైతే పాలక బిజెపి స్పందనలు మరో కోణంలో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఎందుకంటే గతంలోనూ కొన్ని అవినీతి ఆరోపణలూ, తీవ్ర వివాదాలు వచ్చిన ఉదాహరణలు వున్నాయి. కానీ నేరుగా చర్య తీసుకున్న సందర్భాలు దాదాపు లేవు. ఎందుకంటే పైకి ఏమి చెప్పినా పాలక వర్గాలు ఎప్పుడూ న్యాయ వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికే పాకులాడతాయి. చట్టం వ్యవస్థపై ఆధారపడి వుంటుంది గానీ వ్యవస్థ చట్టంపై ఆధారపడి వుండదని కారల్ మార్క్స్ చెప్పిన మాట ఎప్పుడూ మర్చిపోకూడదు. దీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ హయాంలో ఒక విధంగా న్యాయ వ్యవస్థ ఒత్తిడికి గురైతే బిజెపి హయాంలో అది మరింత బాహాటంగా కళ్లకు కడుతున్నది. నిబద్ధ న్యాయ వ్యవస్థ (కమిటెడ్ జ్యుడిషియరీ) వుండాలనేది ఇందిరా గాంధీ తరచూ చెప్పిన మాట. ఆఖరుకు ఆమె ప్రకటించిన ఎమర్జెన్సీ రాజ్యానికి కూడా అప్పటి సుప్రీం కోర్టు ఆమోద ముద్ర వేసింది. ఎప్పుడూ ఆ విషయాన్ని వల్లించే బిజెపి హయాంలో ఇది మరింత దారుణంగా తయారైంది. పి.వి నరసింహారావు హయాంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిని అభిశంసించేందుకు పార్లమెంటు చర్యలు తీసుకున్నా నాటి ప్రభుత్వం బయటపడేసింది. సిజెఐగా పనిచేసిన జస్టిస్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వస్తే కేంద్రం ఏ చర్యా తీసుకోలేదు. తర్వాత ఆయనకు మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ పదవి దక్కింది. బిజెపి హయాంలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్ర ఛటర్జీని కూడా అభిశంసించిన పరిస్థితి ఏర్పడితే ఆయన రాజీనామా చేసి బయటపడ్డారు. సిజెఐగా వుండగానే జస్టిస్ రంజన్ గొగోయ్ పాలనా నిర్వహణ తీరుపై సహచర న్యాయమూర్తులే తీవ్రంగా తిరగబడినా-ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు వచ్చినా సురక్షితంగా పదవీ కాలం పూర్తి చేసుకుని కొద్ది రోజులలోనే మోడీ సర్కారు నామినేషన్‌తో రాజ్యసభకు వెళ్లారు. ఇప్పటికే కార్పొరేట్ శక్తులు కాషాయ నేతలూ న్యాయ వ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని చూస్తున్న నేపథ్యంలో ఉన్నత న్యాయమూర్తులే ఆరోపణలకు గురవుతున్న స్థితిలో రాజ్యాంగ స్ఫూర్తితో ఈ సవాలును ఎదుర్కొనవలసి వుంటుంది.

**కేంద్రానికి తాళాలివ్వాలా?**

వివిధ పాలక పార్టీల నేతలూ ప్రభుత్వాలు ఆ యా సమయాల్లో తమ అనుకూలతను బట్టి న్యాయవ్యవస్థ క్రియాశీలతపైన ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. లేదా కొనియాడుతుంటారు. న్యాయమూర్తులు కూడా పరిపరి విధాల స్పందిస్తుంటారు. నీతివంతమైన న్యాయమూర్తులు అనేకమంది ప్రజాస్వామిక స్ఫూర్తి, విశ్వసనీయత, ప్రజల పట్ల నిబద్ధత కోసం కృషి చేస్తుంటారు కూడా, అయితే పాలకవర్గ వ్యవస్థ తన వ్యూహాలకు అనుగుణంగానే అడుగులు వేస్తుంటుంది. ఇదే రాజ్యాంగ మౌలిక స్వభావం గురించిన ప్రస్తావన వచ్చినపుడు ఇదే ధంకర్ కోర్టులపై దాడి చేయడం చూశాం. ఎప్పుడు ఎలాంటి వివాదం వచ్చినా న్యాయమూర్తుల నియామకం కేంద్రం చేతుల్లోకి తీసుకోవడమే పరిష్కారమన్నట్టు మాట్లాడేవారిని చూస్తుంటాం. చూడటమే కాదు, నిజంగానే న్యాయమూర్తుల నియామకం జాప్యం చేస్తూ ముప్పుతిప్పలు పెట్టడం వాస్తవం. ఈ విషయంలో మాజీ సిజెఐ డి.వై.చంద్రచూడ్ ధర్మాసనం గత సెప్టెంబరులో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు కోర్టు ఆగ్రహాన్ని వెల్లడించాయి సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను పక్కన పెట్టడానికి కారణం ఏమిటి అని ఆయన కేంద్రాన్ని నిలదీశారు. ఎడతెగని ఆలస్యం చేసి గుండు గుత్తగా వెనక్కు పంపితే ఏమని అర్థం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టుకు జస్టిస్ సురేష్ కుమార్, పంజాబ్-హర్యానా హైకోర్టుకు జస్టిస్ శాంతాబాయి, జమ్మూ కాశ్మీర్ లడక్ హైకోర్టుకు జస్టిస్ తషి రబ్బాన్‌ను పంపించాలంటూ చేసిన సిఫార్సులను వెనక్కు తీసుకోవడానికి కూడా న్యాయస్థానం సిద్ధపడింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా జాన్ సత్యంను సుప్రీంకోర్టు కొలీజియం 2022 ఫిబ్రవరిలో సిఫార్సు చేసింది. 2023 జనవరిలో పునరుద్ఘాటించింది. అయినప్పటికీ ఇవి జరగలేదు. జార్ఖండ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.సారంగి పేరును ఆలస్యంగా ఖరారు చేయడంవల్ల ఆయన 15 రోజులు మాత్రమే సిజెగా పని చేసి దిగిపోవాల్సి వచ్చింది! 2024 ప్రారంభంలో కొలీజియం పి.ఎం.మాధవన్‌ను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపిక చేస్తే ఆయన సిపిఎం అభిమాని అనీ, రెండుసార్లు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించిందనీ కేంద్రం సిఫార్సు వెనక్కు పంపింది. అయితే ఆయన సిపిఎం అభిమాని అనే వాదన అస్పష్టమైందని, లంకేశ్ చంద్రగౌరి బిజెపి లో ఆఫీసుబేరర్‌గా వున్నా 2023 ఫిబ్రవరిలో ఆమెను మద్రాసు హైకోర్టు న్యాయమూ ర్తిగా నియమించిన సందర్భాన్ని పేరు తీయకుండా కొలీజియం గుర్తుచేసింది. న్యాయ వ్యవస్థలో సంఘ పరివార్ పట్టు పెరిగిపోవడం, న్యాయమూర్తులు నిబంధనలను ఉల్లంఘించేలా వ్యాఖ్యలు చేయడం కూడా చాలాసార్లు చూశాం. కనుక న్యాయమూర్తుల నియామక అధికారం కేంద్రానికి అప్పగించడమే పరిష్కారమన్న వాదనలోనూ వాస్తవికత లేదు.న్యాయ విషయాలన్నిటిపైనా ఒక కమిషన్ ఆధ్వర్యం వహించాలన్న మౌలిక ప్రతిపాదనను కేవలం న్యాయమూర్తుల నియామకాలకు పరిమితం చేస్తూ ఎన్‌జాక్ (నేషనల్ కమిషన్ ఫర్ జుడిషియల్ అపాయింట్‌మెంట్స్) మోడీ సర్కారు తీసుకొచ్చిన బిల్లును సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయవ్యవస్థ స్వతంత్రతనూ ప్రజాస్వామిక నియామక ప్రక్రియనూ సమతుల్యం చేయడం చాలా అవసరమనేది నిర్వివాదాంశం.

**కింకర్తవ్యం?**

న్యాయమూర్తులలో యాభై శాతం మంది అవినీతిపరులున్నారని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఖట్జూ ఒకసారి వ్యాఖ్యానించారు. దానికి ఆయన విచారణకు కూడా హాజరైనారు. ఇదే అలహాబాదు హైకోర్టు నుంచి వచ్చిన ఖట్జూ అవినీతిపరుల జాబితా ఒకటి అప్పటి సిజెఐ లహోటీకి ఇచ్చానని కూడా చెప్పారు. వారి అవినీతిని తాను వెల్లడిస్తానంటే సిజెఐ వద్దని వారించారని ఖట్జూ పేర్కొన్నారు. తాజాగా ఒక కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా తీర్పులు చెప్పినట్టు ఆరోపణలకు గురైన ఒక న్యాయమూర్తిపై లోక్‌పాల్ విచారణకు ఆదేశాలిస్తే నిబంధనలు ఒప్పుకోవంటూ సుప్రీం కోర్టు అడ్డుపడింది. ఇక్కడ లోక్‌పాల్‌గా వున్నది కూడా సుప్రీం మాజీ జడ్జి ఖాన్విల్కర్ కావడం గమనించదగింది. కనుక జస్టిస్ వర్మపై ఆరోపణలు గానీ, వాటిపై విచారణ ప్రహసనం గానీ ఆశ్చర్యం కలిగించదు. ఈ వ్యవహారంలో ఇప్పటికే అనేక ట్విస్టులు చోటు చేసుకున్నాయి. అసలు ప్రమాదం, అగ్నిమాపక బృందాలు వెళ్లడం మార్చి 14 రాత్రి జరిగితే వారికి కాలిపోయిన నోట్ల కట్టలు కనిపించాయన్న అనధికారిక కథనాలు 21న గానీ బయటకు రాలేదు. ఆ తర్వాత అగ్నిమాపక అధికారులు నోట్ల కట్టలు కనిపించినట్టు తాము చెప్పలేదని తమతో చెప్పినట్టు పిటిఐ వార్త ఇచ్చింది. తర్వాత సదరు అధికారి అతుల్ గార్గ్ తాము ఆ మాట తను చెప్పింది కాదని వివరణ ఇచ్చారు. ఇక నోట్ల కట్టలు పెట్టిన గదులు అందరూ వాడుకునేలా వుంటాయని జస్టిస్ వర్మ వివరణ ఇస్తే అందుకు భిన్నంగా దానికి ఎప్పుడూ తాళాలు వేసి వుంటాయని భద్రతా సిబ్బంది చెప్పారు. వర్మను బదిలీ చేయడానికి ఈ విచారణకూ సంబంధం లేదని ఆగమేఘాల మీద స్పష్టత విడుదల చేసిన సుప్రీంకోర్టు కేంద్రం ఒప్పుకున్నాకే బదిలీ ఖరారు చేసి న్యాయ విధులకు దూరం పెట్టింది. మరోవైపున ఆయనను తమ మీద మళ్లీ ఎందుకు రుద్దుతున్నారని అక్కడ బార్ అసోసియేషన్ ఆందోళనకు దిగింది. ఏమైనా విచారణ జరిపే న్యాయమూర్తుల బృందం నివేదిక అందేవరకూ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసే అవకాశం కనిపించడం లేదు. ఈ లోగా జస్టిస్ వర్మ న్యాయవాదుల సలహాలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఆయన రాజీనామా వంటివి చేస్తారేమో తెలియదు. కనుక ఈ ఉదంతంలో చివరకు జరిగేదేమిటో వేచి చూడవలసిన అంశాలు చాలా వున్నాయి. న్యాయమూర్తుల మంచి చెడ్డల చర్చగా గాక న్యాయ వ్యవస్థలో రావలసిన మౌలిక సంస్కరణలు, మరో వైపు దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడం ఇక్కడ కీలకం. వ్యక్తిగతంగా న్యాయమూర్తుల లేదా న్యాయాధికారుల అవినీతి ఒకటైతే క్విడ్ ప్రోకో తరహాలో పాలకులు ఆ వ్యవస్థతో అనధికార అవగాహనకొచ్చే పరిస్థితిని నివారించడం మరింత ముఖ్యం. జస్టిస్ వర్మ ఉదంతం చివరకు ఎలా ముగుస్తుందో చూశాక మరింత లోతైన చర్చ చేయవలసి వుంటుంది. ★

**వర్మను బదిలీ చేయడానికి ఈ విచారణకూ సంబంధం లేదని ఆగమేఘాల మీద స్పష్టత విడుదల చేసిన సుప్రీంకోర్టు కేంద్రం ఒప్పుకున్నాకే బదిలీ ఖరారు చేసి న్యాయ విధులకు దూరం పెట్టింది. మరోవైపున ఆయనను తమ మీద మళ్లీ ఎందుకు రుద్దుతున్నారని అక్కడ బార్ అసోసియేషన్ ఆందోళనకు దిగింది. ఏమైనా విచారణ జరిపే న్యాయమూర్తుల బృందం నివేదిక అందేవరకూ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసే అవకాశం కనిపించడం లేదు. ఈ లోగా జస్టిస్ వర్మ న్యాయవాదుల సలహాలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఆయన రాజీనామా వంటివి చేస్తారేమో తెలియదు. కనుక ఈ ఉదంతంలో చివరకు జరిగేదేమిటో వేచి చూడవలసిన అంశాలు చాలా వున్నాయి. న్యాయమూర్తుల మంచి చెడ్డల చర్చగా గాక న్యాయ వ్యవస్థలో రావలసిన మౌలిక సంస్కరణలు, మరో వైపు దాని స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడం ఇక్కడ కీలకం. వ్యక్తిగతంగా న్యాయమూర్తుల లేదా న్యాయాధికారుల అవినీతి ఒకటైతే క్విడ్ ప్రోకో తరహాలో పాలకులు ఆ వ్యవస్థతో అనధికార అవగాహనకొచ్చే పరిస్థితిని నివారించడం మరింత ముఖ్యం. జస్టిస్ వర్మ ఉదంతం చివరకు ఎలా ముగుస్తుందో చూశాక మరింత లోతైన చర్చ చేయవలసి వుంటుంది.**

సెటైర్

**వి.వి.శ్రీనివాసరావు**

# ఈ ఉగాదైనా ...!



**కేలెండర్‌లో తేదీలు, నెలలు మారుతున్నా... పాలకుల విధానాలు మారనంతకాలం మన లాంటి సామాన్యుల పరిస్థితి ఇంతేరా...! ఉగాది పంచాంగ శ్రవణం చెప్పించుకుని రాశి ఫలాలాలో... మన తలరాతలో మన జీవితాల్ని శాసిస్తున్నాయని నమ్ముతూ, వీటికి కారకులైన అసలు దోషుల్ని గుర్తించనంతకాలం మన జీవితాలు ఇలానే ఉంటాయి. ఇప్పడంతా మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి అసలు విషయాలు గ్రహించకుండా డైవర్షన్ పాలిట్రిక్స్ కాలం నడుస్తోందిరా...!**

**ఉ**గాది పచ్చడి తీసుకోరా.. అంటూ తన ఇంటి పక్కనే ఉన్న మిత్రుడు అప్పారావ్‌ని కలిసి తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు చెప్పాడు సుబ్బారావ్..!

ఉగాది పచ్చడి తిన్న అప్పారావ్.. అబ్బా.. ఏంట్రా ఉగాది పచ్చడి మరీ ఇంత చేదుగా ఉంది? అన్ని రుచులూ కలిపి కదా ఉగాది పచ్చడి ఉండాలి. ఒక చేదే కలిపి ఇచ్చినట్లుందిరా అంటూ... మొహం వేప చేదు మింగినట్లు పెట్టాడు అప్పారావ్..!

క్రోధినామ సంవత్సరం పోయి 'విశ్వావసు నామ సంవత్సరం'లో అడుగు పెట్టాం కదా...! గత సంవత్సరంలో క్రోధాన్ని ఎలాగూ చూపించలేకపోయావు కదా..! ఈ విశ్వావసు సంవత్సరమైనా నీ కోపాన్ని చూపించకపోతే, 'విశ్వావసు' అంటే 'అందరికీ ఆశ్రయం' (నివాసం) కూడా లేకుండా పోయే ప్రమాదం ఉందని తెలియజేయడానికే ఉగాది పచ్చడిని చేదు ఎక్కువ వేసి మరీ అందరికీ పెడుతున్నాను అన్నాడు సుబ్బారావ్.!

నీ తెలివి తెల్లారినట్లే ఉందిరా బాబూ...నోరంతా పాడైపోయింది. ఒసే కాంతం కొంచెం పంచదార తీసుకురా అంటూ తన భార్యను కేక వేశాడు అప్పారావ్...!

ఈ నెల రేషన్‌లో పంచదార 3 కేజీలు రాస్తే డబ్బులు చాలవని ఒక కేజీనే తెచ్చారండి. అదీ అయిపోయి రెండు రోజులయ్యిందని నిన్ననే చెప్పాను కదా..! అని వంటింట్లో నుంచి కాంతం అరుపు వినిపించిన వెంటనే నోరు వెళ్లబెట్టాడు అప్పారావ్..!

ఇదేంట్రా బాబూ..! కొత్త సంవత్సరాది ప్రారంభంలోనే నాకు చేదు పెట్టి భయపెట్టావ్.. ఈ ఏడాదంతా ఇలానే ఉండేలా ఉంది? ఉదయాన్నే శర్మగారి ఇంటికెళ్లి ఈ సంవత్సరం నా జాతకం చూపించుకుంటే అక్కడా ఇదే చేదు అనుభవం ఎదురయ్యింది...! ఈ ఏడాది నా రాశికి "ఆదాయం-2, వ్యయం-14 అట, రాజపూజ్యం -1, అవమానం-6 అట, ఈ సంవత్సరం నాకు మంచి రోజులు వస్తాయన్న 'విశ్వాసం' ఎక్కడో ఓ మూల కలుగుతున్నా మరోవైపు నా రాశి ఫలాలు, జాతకం చూస్తే ఈ ఏడాది ఎలా గడుస్తుందోనని భయమేస్తోందిరా..! ఏదైనా ఉపాయం ఉంటే చెప్పరా..! అడిగాడు అప్పారావ్.!

ఉగాది నాడు చెప్పే పంచాంగ శ్రవణంలో ఏం చెప్పినా.. నీకూ, నాకే కాదు, జనాలందరికీ ఏ ఏడాది ఎలా ఉండాలో నిర్ణయించేది మనం ఓట్లేసి గెలిపించిన పాలకుల చేతుల్లోనే ఉంటుంది. ఈ సంగతి తెలియక కొంచెం గాబరా పడుతుంటామంతే..! ఈ భూ ప్రపంచమంతా 'పైకం' చుట్టూనే తిరుగుతోందనేది జగమెరిగిన సత్యంరా..! అని అసలు విషయం చెప్పాడు సుబ్బారావ్.!

ఈ ఉగాదికి ముందే అమెరికాలో ట్రంప్ మళ్లీ అధికారంలోకి వచ్చినప్పడే మనందరికి కొత్త తంటాలు వచ్చి పడ్డాయి. ప్రపంచంలో యుద్ధాలు, దాడులు, ఆంక్షలు, సుంకాలు పెంచేశాడు. పాపం, మన దేశం నుండి అమెరికాలో ఏదో కూలో నాలో చేసుకుని బతుకుతున్న వాళ్లని చేతులకు, కాళ్లకు సంకెళ్లు వేసి మన దేశానికి పంపాడు..! ఈ మధ్యే కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో మన ప్రభుత్వాలు చేసిన కేటాయింపులు, నిర్ణయాలు, విధానాలను బట్టే మన భవిష్యత్ ఏంటో అర్థమైపోయింది..! కార్పొరేట్లకు రాయితీలిచ్చి దిగువ స్థాయిలో ఉన్న ఉపాధి కూలీలకు, రైతాంగానికి, కార్మికులకు బడ్జెట్‌లో నిధులు కోత పెట్టారా..! మన రాష్ట్ర రాజధాని నిర్మాణానికి ఇచ్చిన అప్పుకి అసలు, వడ్డీ మన రాష్ట్ర ప్రజలందరిపై వేశారని వేరే చెప్పాలా..! ఇప్పటికే ఆస్తి ఆధారంగా పన్నులు, వృత్తి పన్ను పెంచడం, అంతెందుకు ఇంకా ఎండలు మండక ముందే షాక్ కొడుతున్న కరెంటు బిల్లుల వాతలు, స్మార్ట్ మీటర్ల మోతలు ఇవన్నీ కళ్ల ముందే కనిపిస్తున్నాయా..! దీనిని బట్టి ఆదాయాలు మాట ఎలా ఉన్నా వ్యయాలు పెరగడం ఖాయం కదా..! అన్నాడు సుబ్బారావ్!

నా కొడుక్కి ఈ కొత్త ఏడాదిలోనైనా డిఎస్సీ వస్తుందో లేదో పంచాంగం చూపించుకోమని పంపానురా..ఈ సారైనా వస్తుందంటావా.. అన్నాడు అప్పారావ్..!

ఇది బాబు గారు గద్దెనెక్కినప్పట్నుంచి చెబుతున్నమాట..! కానీ ఈ డిఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందో..వచ్చినా ఈ పోస్టులు నింపుతారో..లేదో... అన్నది అనుమానంగానే ఉందని పిడుగు లాంటి వార్తను చెప్పేసరికి అప్పారావ్ సోఫాలో కూలబడిపోయాడు...!

ఓరే అప్పారావ్ ఏమైందిరా..! ఒక్కసారిగా అలా కూలబడ్డావ్.. సపర్యలు చేసి కొంచెం నీళ్లు తాగిస్తే తేరుకుని.. ఒరే సుబ్బారావ్.. ఈ ఏడాది అంతా నాకు పెద్ద గండమే దాపురించినట్లుందిరా...! నా భవిష్యత్ ఏంటో అర్థం కావడంలేదురా అన్నాడు అప్పారావ్..!

అన్నయ్య గారూ...! మా మహిళలకైనా ఆ ఫ్రీ బస్, తల్లికి వందనం, ప్రతి నెలా నగదు ప్రోత్సాహం ఇవేమైనా వచ్చేటట్లు ఉందంటారా..! అని తమ మనసులోని మాటని బయటపెట్టింది కాంతం..! చెల్లెమ్మా..! మన బాబు గారు ఇచ్చిన హామీలకి, సూపర్ సిక్స్ అమలుకి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేవమ్మ..! తెస్తున్న అప్పులుకు ఏవేవో షరతులన్నీ ఒప్పుకుని వస్తున్నారు..! ఏ పథకాలు అమలు చేసినా మనందరిపై భవిష్యత్‌లో కొత్త కొత్త రూపాల్లో భారాలు మాత్రం ఖాయం...! నువ్వు ఇప్పటి వరకు వంటింట్లో పోపుల డబ్బాల్లో దాస్తున్నది కూడా ఖాళీ అయిపోవడం ఖాయం..! అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు సుబ్బారావ్..! పోపుల డబ్బాలో డబ్బులు దాచుకునే రోజులు ఎప్పుడో మా ఆడాళ్లకు పోయాయి! తెచ్చిన డ్వాక్రా అప్పులు, ప్రైవేటు అప్పుల వడ్డీలకే సంపాదించిందంతా పెట్టాల్సి వస్తోంది...! మీ మిత్రుడికి వచ్చే జీతం చాలక, నా కొడుక్కి ఉద్యోగం, సజ్జోగం లేక, పండక్కో... పబ్బానికో... ఒక చీర కొనుక్కుందామన్నా చేతిలో చిల్లిగవ్వ ఆడే పరిస్థితి కనబడడం లేదన్నయ్యా..! అంటూ నిట్టూర్చింది కాంతం.!

కేలెండర్‌లో తేదీలు, నెలలు మారుతున్నా... పాలకుల విధానాలు మారనంత కాలం మన లాంటి సామాన్యుల పరిస్థితి ఇంతేరా...! ఉగాది పంచాంగ శ్రవణం చెప్పించుకుని రాశి ఫలాలో... మన తలరాతలో మన జీవితాల్ని శాసిస్తున్నాయని నమ్ముతూ, వీటికి కారకులైన అసలు దోషుల్ని గుర్తించనంత కాలం మన జీవితాలు ఇలానే ఉంటాయి. ఇప్పుడంతా మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి అసలు విషయాలు గ్రహించకుండా డైవర్షన్ పాలిట్రిక్స్ కాలం నడుస్తోందిరా...! అని లోకం తీరును వివరించాడు సుబ్బారావ్..! కాబట్టి ఈ ఉగాది నుండైనా ఆ సంఘాలోళ్లు... ఎర్ర జెండావోళ్లు చెబుతున్నట్లు వారిచ్చే పోరాటాల్లో భాగస్వాములైతే..ఈ భారాల్ని, ఈ విధానాల్ని కొంతమేరకైనా తిప్పికొట్టొచ్చు..అన్నాడు సుబ్బారావ్..!

అర్థమయ్యిందిరా.. ఆ జాతకాలు, రాశుల్లో ఎలా ఉన్నా వాస్తవంలోకి చూడమన్నావ్‌రా..! కచ్చితంగా నువ్వు చెప్పినట్లే పోరాటాల్లోకి వస్తానురా.. అని మనసుని కుదుటపర్చుకున్నాడు అప్పారావ్!

**(రచయిత సెల్: 94900 98799)**

కవిత్వం

## మీరేమంటారు?

**పు**లులతో మేకలకు
పెళ్ళిళ్ళు జరిపిస్తాం
భద్రత తప్పి పోని
బతుకు ప్రసాదిస్తాం
చలువ చెట్ల కింద
సంసారాలు పెట్టిస్తాం

పిల్లులనూ ఎలుకలనూ
పేరంటాళ్ళుగ పిలిపిస్తాం
పెద్ద ముత్తైదువులయి
దీవించమని అభ్యర్థిస్తాం
ఎంత ఖర్చయినా ఘనంగ
ఈ వేడుక జరిపిస్తాం

పిచ్చోళ్ళుగ చూడకండి
పెద్దలు చెప్పిందే చేస్తున్నం

కూలీల కష్టాన్ని దోచి ఎదిగిన
కార్పొరేట్లతోనే పేదలను కలిపి
పెద్దోళ్ళను చేస్తామంటే నమ్మగాలేంది
ఇది మాత్రం ఎందుకు నమ్మరు?

**- రణ వీర**

**మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :**
editpageps @gmail.com

రూ.15 లక్షల కోట్ల జిఎస్‌డిపి కోసం

# రూ.40 లక్షల కోట్లు పెట్టుబడులు!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 2028-29 నాటికి రూ.15 లక్షల కోట్ల జిఎస్‌డిపిని సాధించేందుకు ఏకంగా రూ.40 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు సమకూర్చుకోవాలని ప్రతిపాదించడం గమనార్హం. ఇప్పటికే 2028-29, 2047-48 ఆర్థిక సంవత్సరాల లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్లను విడుదల చేసింది. 2047-48 నాటికి ఏకంగా 3 కోట్ల కోట్ల రూపాయల జిఎస్‌డిపిని సాధించడం ఒక లక్ష్యంగా నిర్దేశించుకోగా, 2028-29 నాటికి 29.29 లక్షల కోట్ల జిఎస్‌డిపి సాధించాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర జిఎస్‌డిపి 15.93 లక్షల కోట్లుగా తేల్చారు. దీనిని ప్రతి ఏటా 15 శాతం వృద్ధితో ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే సోమవారం నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో 18.65 లక్షల కోట్ల జిఎస్‌డిపి సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. 2028-29 నాటికి ఈ జిఎస్‌డిపి 29.29 లక్షల కోట్లకు చేరుకోవాలని నిర్దేశించుకున్నారు. ఇంత భారీ జిఎస్‌డిపి లక్ష్యాన్ని సాధించాలంటే వివిధ స్థాయిలో వ్యవసాయ, పరిశ్రమలు, సేవా రంగంలో అభివృద్ధి సాధించాలి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల కోసం ప్రత్యేక ప్రణాళికతో లక్ష్యాన్ని కూడా సిద్ధం చేసుకుంది. 2028-29 నాటికి అదనంగా 15 లక్షల కోట్ల జిఎస్‌డిపి సాధించాలంటే ముందుగా 40.43 లక్షల కోట్ల పెట్టుబడులు రావాలని అంచనా వేస్తున్నారు. సేవా రంగానికి సంబంధించి 19.52 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో కీలకమైన వ్యవసాయ రంగంలో 5.85 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావాలని అనుకుంటున్నారు. పారిశ్రామిక రంగంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. ఇందులో 9.29 లక్షల కోట్లను ప్రభుత్వ రంగంలో 31.14 శాతం ప్రయివేటు రంగంలో పెట్టుబడులుగా రాబట్టుకోవాలని నిర్ణయించారు.

**రాష్ట్రం నుంచి 4.8 లక్షల కోట్లే :** ప్రభుత్వ పెట్టుబడుల్లో రాష్ట్రం నేరుగా పెట్టేది కేవలం రూ.4.8 లక్షల కోట్లేనని చెబుతున్నారు. ఈ మొత్తాన్ని వచ్చే బడ్జెట్‌లో చూపించాలని కూడా నిర్ణయించడం విశేషం. కేంద్రం, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్‌ల ద్వారా 2.5 లక్షల కోట్లు, రాష్ట్రంలోని పిఎస్‌యుల ద్వారా మరో రెండు లక్షల కోట్లు సమీకరించాలని నిర్ణయించారు.



# 1600 దాటిన మృతులు!

- మయన్మార్, బ్యాంకాక్‌ల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు
- భారత్ సహా పలు దేశాల నుండి సాయం

నెపిడా, బ్యాంకాక్ : మయన్మార్, థాయిలాండ్‌లో శుక్రవారం సంభవించిన భూవిలయంలో మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. మయన్మార్‌లో ఇప్పటివరకు 1600మందికి పైగా మరణించారని మయన్మార్ మిలటరీ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, 118మంది సిబ్బందితో ఆగ్రా నుండి ఫీల్డ్ ఆసుపత్రిని మయన్మార్‌కు భారత్ పంపించింది. ఆయా ప్రాంతాల్లో మరణించిన వారిలో భారతీయులెవరూ లేరని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. మయన్మార్‌లో మరో 3,400 మంది గాయపడ్డారని, 30మంది ఆచూకీ తెలియలేదని అక్కడి ప్రభుత్వం తెలిపింది. సమయం గడుస్తున్న కొద్దీ శిథిలాల నుండి మృతదేహాలు బయటపడుతున్నాయని, సమాచారం సేకరిస్తున్నారని, ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుందని ప్రభుత్వం పేర్కొంది. మయన్మార్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వల్ల అత్యవసర సర్వీసులు తీవ్రంగా బలహీనమయ్యాయి. దీంతో శక్తివంతమైన ఈ ప్రకృతి వైపరీత్యాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనడంలో ప్రభుత్వం పలు ఇబ్బందులు పడుతోంది. మరోవైపు బ్యాంకాక్‌లో 10మంది మరణించారు. 26మంది గాయపడ్డారు. రాజధాని బ్యాంకాక్‌లోని చటుచక్ మార్కెట్‌కు సమీపంలో నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో దాదాపు వందమంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారని తెలుస్తోంది.

భారీ భూకంపంతో భవనాలు నేలమట్టమైన పరిస్థితుల్లో తమ వారి కోసం కేవలం చేతులతోనే ఆ శిథిలాలను, రాళ్లగుట్టలను తవ్వేందుకు ప్రయత్నించడం కనిపిస్తోంది. సాయం కోసం కేకలు వేస్తున్న వారిని బయటకు లాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మయన్మార్‌లో శనివారం కూడా ప్రకంపనలు ఎక్కువగానే కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిల్లో ఒకదాని తీవ్రత 6.4గా నమోదైంది. మాండలే నగరంలో డజన్ల సంఖ్యలో భవనాలు కూలిపోవడంతో ఆ శిథిలాల్లో చిక్కుకున్న వారిని వెలికి తీయడానికి తమకు సాయం కావాలని సహాయక బృందాలు పేర్కొంటున్నాయి. మయన్మార్ సాంస్కృతిక రాజధాని అయిన మాండలేలో ఒక భవనం కూలిన ఘటనలో 90మందికి పైగా శిథిలాల్లో చిక్కుకుపోయారు. 12 అంతస్తుల ఈ భవనం భూకంపం ధాటికి ఆరు అంతస్తులుగా మిగిలింది.

రక్తం కోసం డిమాండ్ బాగా వుందని, రక్త దాతలు ఉదారంగా ముందుకు రావాలని ప్రభుత్వం కోరింది. విదేశీ సాయం తీసుకోవడానికి తాము సిద్ధంగా వున్నామని మిన్ ఆంగ్ ప్రకటించారు. ఇంకా జరిగిన నష్టం, మరణాలపై ఒక స్పష్టత రావాల్సి వుందని ఎన్‌జిఒ ప్లాన్ ఇంటర్నేషనల్‌కు సంబంధించిన మయన్మార్ డైరెక్టర్ హైదర్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఇంతటి విధ్వంసాన్ని తాము చూడలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మానవతా సాయం చాలా ముఖ్యమని అన్నారు.

**భారత్ అపన్న హస్తం118 మందితో ఫీల్డ్ ఆసుపత్రి**

118మంది సిబ్బందితో ఆగ్రా నుండి ఫీల్డ్ ఆసుపత్రిని భారత్, మయన్మార్‌కు పంపుతోంది. పోర్ట్ బ్లెయిర్, విశాఖపట్నం నుండి నాలుగు నౌకలు బయలుదేరుతున్నాయి. మయన్మార్‌లో సహాయక చర్యలు చేపట్టేందుకు 80మంది ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందితో ఒక బృందాన్ని భారత్ పంపుతోంది. 'ఆపరేషన్ బ్రహ్మ' కింద 15టన్నుల సహాయ సామాగ్రిని భారత్, మయన్మార్‌కు పంపింది. భారత వైమానిక దళానికి చెందిన మిలటరీ రవాణా విమానం ద్వారా యాంగాన్ నగరానికి ఈ సామాగ్రి అందజేసింది.


మయన్మార్‌లో సహాయక చర్యలు

ఎమర్జెన్సీ హెల్త్‌కిట్లను కూడా మయన్మార్‌లోని భారత ఎంబసీ ఏర్పాటు చేసింది. భారత నావికాదళానికి చెందిన రెండు నౌకలు 40టన్నుల ఆహారం, మానవతా సాయాన్ని తీసుకుని బయలుదేరాయి.

**మయన్మార్ ప్రభుత్వ అధినేతకు ప్రధాని మోదీ ఫోన్**

మయన్మార్ మిలటరీ ప్రభుత్వ అధినేత మిన్ ఆంగ్ హ్లెయింగ్‌తో ప్రధాని మోదీ శనివారం మాట్లాడారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సాయమందిస్తామని హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కొంటున్న మయన్మార్‌కు పూర్తి బాసటగా వుంటామన్నారు. ఈ మేరకు మోదీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. భూకంపం సంభవించినప్పుడు మయన్మార్‌లో వున్న భారత పర్యాటకులు సురక్షితంగా శనివారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. అక్కడి తాము ఎదుర్కొన్న భయంకరమైన అనుభవాలను వారు పంచుకున్నారు.

**వెల్లువెత్తుతున్న సాయం**

భారత్‌తో పాటు చైనా, రష్యా, దక్షిణకొరియాలు సహాయక బృందాలను మయన్మార్‌కు పంపాయి. 1.38కోట్ల డాలర్ల విలువైన సాయాన్ని చైనా పంపనుంది. వీటిలో టెంట్లు, అత్యవసర మెడికల్ కిట్లు, ఆహారం, నీరు, ఇతర నిత్యావసరాలు వున్నాయి. మార్చి 31నాటికి మొదటి విడత సాయం అందనుందని చైనా ఎంబసీ పేర్కొంది. 20లక్షల డాలర్ల విలువైన సాయాన్ని మయన్మార్‌కు పంపనున్నట్లు దక్షిణ కొరియా ప్రకటించింది. పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అవసరమైతే అదనపు సాయాన్ని అందిస్తామని విదేశాంగ శాఖ తెలిపింది. ఐక్యరాజ్య సమితి 50లక్షల డాలర్ల సాయాన్ని కేటాయించింది. మయన్మార్‌లో నెలకొన్న భీతావహ పరిస్థితులను సమీక్షించామని, అత్యవసరంగా అందించాల్సిన మానవతా సాయాన్ని గుర్తించామని, త్వరలోనే పంపుతామని ఆసియాన్ దేశాల విదేశాంగ మంత్రులు శనివారం తెలిపారు. సహాయక చర్యల్లో కూడా పాలు పంచుకుంటామని హామీ ఇచ్చారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

బ్యాంకాక్‌లో కుప్పకూలిన 30 అంతస్తుల భవనం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వంద మంది వరకు లోపల చిక్కుకుపోయారని భావిస్తున్నారు. ప్రతి ప్రాణం విలువైనదేనని, అందుకే తమ వద్ద వున్న వనరులతోనే అత్యంత వేగంగా చేయగలిగిన చర్యలు చేపడుతున్నామని బ్యాంకాక్ గవర్నర్ చాడ్‌చార్ట్ సిటిపంట్ చెప్పారు. లోపల ఎవరైనా జీవించి వున్నారా లేదా అని తెలుసుకోవడానికి థర్మల్ ఇమేజింగ్ డ్రోన్‌లను రంగంలోకి దింపామని, 15మంది నుండి సంకేతాలు వచ్చాయని తెలిపారు. బీటలు వారిన, ప్రమాదకరంగా మారిన భవనాలను తనిఖీలు చేయడానికి వందమందికి పైగా ఇంజనీర్లను నియమించినట్లు బ్యాంకాక్ నగర అధికారులు తెలిపారు. దాదాపు 2వేల భవనాలు అటువంటి జాబితాలో వున్నట్లు తెలుస్తోంది. ఇళ్లలోకి వెళ్లడం అంత సురక్షితం కాదనే ఉద్దేశంతో వందలాదిమంది గత రాత్రంతా ఆరుబయటే గడిపారు.

# ప్రతిభావంతులకు పురస్కారాలు

● కళారత్న 86, ఉగాది అవార్డులకు 116 మంది ఎంపిక

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక శాఖ ద్వారా విశ్వావసు నామ ఉగాది పురస్కారాలకు రాష్ట్రంలోని వివిధ రంగాల్లోని ప్రతిభావంతులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కళారత్న పురస్కారాల్లో సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, ఉగాది అవార్డులకు సాహిత్యం, సంగీతం, నృత్యం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, వైద్యం, ఇంద్రజాలం, ముఖాభినయం, హరికథ, బుర్రకథ, జర్నలిజం, సామాజిక సేవ రంగాల్లోని ప్రతిభావంతులను ఎంపిక చేసింది. కళారత్న పురస్కారానికి మొత్తం 86 మంది, ఉగాది అవార్డులకు 116 మందిని ఎంపిక చేశారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్దప్రసాద్ ఆధ్వర్యంలోని కమిటీ వడపోతల మధ్య ఎంపికలు జరిగాయి. ఈ నెల 15 వరకు అవార్డులకు దరఖాస్తులను స్వీకరించగా ఎక్కువ మంది లిటరేచర్ విభాగంలోనే వచ్చాయి. జిల్లాలు, సామాజిక సమీకరణలు, ప్రతిభ, సిఫార్సులు తదితరాలను పరిగణనలోకి తీసుకున్న కమిటీ తుది జాబితాను మూడురోజుల క్రితమే సిద్ధం చేసింది. కమిటీ సిఫార్సు చేసిన వారిని మాత్రమే ఎంపిక చేశారు. గతంలో పద్మ అవార్డులు, సంగీత నాటక, కేంద్ర సాహిత్య అవార్డులు, కేంద్ర ప్రభుత్వ అవార్డులు, ఉగాది, కళారత్న పురస్కారాలు పొందిన వారి పేర్లు పరిగణనలోకి తీసుకోలేదు. తాజాగా అవార్డులకు ఎంపికైన వారిలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులు, కవులు, సామాజిక వేత్తలు తదితరులు ఉన్నారు. శుక్ర, శనివారాల్లో అవార్డులకు ఎంపికైన వారికి సమాచారాన్ని తెలియజేశారు. ఉగాది పండగను పురస్కరించుకుని ఆదివారం నాడు ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు వేడుకలు జరగనున్నాయి. అనంతరం జరిగే సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరగనుంది. కళారత్న అవార్డుల్లో అత్యధికంగా 17 మందికి లిటరేచర్‌లోనూ, మిగతా వారిలో మ్యూజిక్, డ్యాన్స్, డ్రామా, పెయింటింగ్, హాస్యవదనం, బుర్రకథ, హరికథ విభాగాల్లోని వారిని ఎంపిక చేశారు. జర్నలిజంలోనూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని సైతం కళారత్న వరించింది. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు (కృష్ణా), బాలసాహిత్యంలో అలపర్తి వెంకట సుబ్బారావు (గుంటూరు), పద్య విభాగంలో పాలపర్తి శ్రీధర్ (పశ్చిమగోదావరి) అవార్డులను కైవసం చేసుకున్న వారిలో ఉన్నారు.

**కళారత్న పొందిన ప్రముఖులు వీరే..**

తెలంగాణకు చెందిన సినీ నటుడు బాలిరెడ్డి పృథ్వీరాజ్, ఢిల్లీలోని సాహిత్య అకాడమీ సెక్రటరీ కృత్తివెంటి శ్రీనివాసరావు (కృష్ణా జిల్లా), ఆచార్య సలాకా రఘునాథశర్మ (తూర్పుగోదావరి), సయ్యద్ నసీర్ అహ్మద్ (గుంటూరు), దాట్ల దేవదానం రాజు (యానాం), రంగినేని సత్యనారాయణరావు (నరసాపురం-పశ్చిమగోదావరి జిల్లా), వి.ఆర్.రాసాని (తిరుపతి), బోయి హైమవతి (అంబేద్కర్ కోనసీమ), నందివెలుగు ముక్తేశ్వరరావు (ఐఎఎస్) (బాపట్ల), మండేపు ప్రసాద్ (ఐఆర్ఎస్-ఎన్టిఆర్) తదితరులు ఉన్నారు. రంగస్థలం నుంచి కావూరు సత్యనారాయణ (గుంటూరు), సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ యల్లాప్రగడ సౌభాగ్యక్షేత్రరావు (గుంటూరు), యడవల్లి గంగాధర్ (కర్నూలు), దామోదర గణపతిరావు (కృష్ణా), శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ (ఓటిఆర్), రామకరి రాజేష్ (ఎన్టిఆర్)లతోపాటు మరికొంత మందిని ఎంపిక చేశారు. బుర్రకథలో సప్పా కనకారావు (ఏలూరు), గొర్రెల రాము (అంబేద్కర్ కోనసీమ), హరికథలో సప్పా భారతి (ఏలూరు)లను ఎంపిక చేశారు.

జర్నలిజంలో ఈనాడు పత్రిక ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు (ఎన్టిఆర్), స్వాతి పత్రిక ఎడిటర్ వేమూరి బలరామ్ (ఎన్టిఆర్), ఆంధ్రజ్యోతి సెంట్రల్ డెస్క్ కె.నాగసుధాకర్ (ఎన్టిఆర్), బోగారి రాయుడు (అనకాపల్లి), పుల్లా అంకబాబు, జి.వల్లీశ్వర్, సోషల్ సర్వీస్‌లో కిరణ్‌క్రాంతి చౌదరి, తానా మాజీ ప్రెసిడెంట్ (యుఎస్ఎ) కోమటి జయరామ్, సిహెచ్ మస్తానయ్య (గుంటూరు), మెడికల్ విభాగం సేవల్లో ఓరుగంటి వెంకటరమణ బాలాజీలను ఎంపిక చేశారు. ఉగాది అవార్డులకు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, బంద్ల మాధవరావు, కన్నెరి పద్మ, తేళ్ల అరుణ, వేంపల్లి షరీఫ్, సరికొండ నరసింహ రావు, కలిమికొండ సాంబశివరావు (కలిమిశ్రీ), నూనె అంకమ్మరావు, లగడపాటి సంగయ్య, అన్నవరపు బ్రహ్మయ్య, ఆకుల మల్లేశ్వరరావు, యనమదల మంజుల, కమ్మగంతు రామకృష్ణ, కొల్లూరి, సింహాద్రి వాణి, గిరిధర్ అరసవల్లి, గంగోత్రి సాయి, రెంటాల జయదేవ ఉన్నారు.







# అదరగొట్టిన సాయి సుదర్శన్

● ముంబయిపై గుజరాత్ ఘన విజయం



**అహ్మదాబాద్:** ఐపిఎల్ సీజన్-18లో ఓటమితో ఆరంభించిన గుజరాత్ టైటన్స్ రెండో మ్యాచ్‌లో ముంబయిపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 196పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం ముంబయిని నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 6వికెట్ల నష్టానికి 160పరుగులకే పరిమితం చేసింది. ముంబయి బ్యాటర్లలో సూర్యకుమార్(48), తిలక్ వర్మ(39) మాత్రమే రాణించగా.. గుజరాత్ బౌలర్లు సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లతో ముంబయిని కట్టడి చేశారు. అంతకుముందు ఓపెనర్ సాయి సుదర్శన్(63) అర్ధ శతకాని తోడు శుభ్‌మన్, బట్లర్ బ్యాటింగ్‌లో రాణించారు. ముంబయి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న ఈ చిచ్చరపిడుగు.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ధాటిగా ఆడాడు. తొలి వికెట్‌కు 78 పరుగులు జోడించి గట్టి పునాది వేశాడు. సొంత మైదానంలో గుజరాత్ టైటన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్(63), శుభ్‌మన్ గిల్(38) దంచేశారు. ముంబయి ఇండియన్స్ బౌలర్లు ఎంత ప్రయత్నించినా పవర్ ప్లేలో వికెట్ ఇవ్వలేదు ఈ జోడీ. అయితే.. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో గిల్ డీప్ స్క్వేర్ లెగ్‌లో షాట్ ఆడి నమన్ ధీర్ చేతికి చిక్కాడు. 78 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన జోస్ బట్లర్(39) ఉన్నంత సేపు విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. సాయితో కలిసి.. జట్టు స్కోర్ 120 దాటించాటాడు. 5 ఫోర్లు, ఒక సిక్సర్ బాదిన బట్లన్‌ను ముజీబ్ రెహ్మాన్ వెనక్కి పంపాడు. బట్లర్ ఔటయ్యాక షారుక్ ఖాన్(9), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్(18)లతో కలిసి స్కోర్‌బోర్డును పరుగెత్తించాడు సుదర్శన్. డెత్ ఓవర్లలో ధాటిగా ఆడే క్రమంలో ఔటయ్యాడు. దీపక్ చాహర్ ఒకే ఓవర్లో రూథర్‌ఫోర్డ్ ను ఔట్ చేయడం.. ఆ తర్వాతి బంతికే పాండ్యా డైరెక్ట్ త్రోకు రాహుల్ తెవాటియా(0) రనౌట్ అయ్యాడు. కగిసో రబడ(16) మూడో బంతిని సిక్సర్‌గా మలిచాడు. రషీద్ ఖాన్(7) సైతం సిక్సర్ బాది జోరు పెంచాలనుకున్నాడు. అయితే.. కాకినాడకు చెందిన సత్యనారాయణ రాజు సూపర్ డెలివరీతో రషీద్‌ను బోల్తా కొట్టించాడు. దాంతో, గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 196 పరుగులు చేసింది. ముంబయి బౌలర్లు హార్దిక్‌కు రెండు, చాహర్, రెహ్మాన్, సత్యనారాయణ రాజుకు ఒక్కో వికెట్ దక్కాయి.

**స్కోర్‌బోర్డు...**

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (ఎల్‌బి)బౌల్ట్ 53, శుభ్‌మన్ (సి)నమన్ ధీర్ (బి)హార్దిక్ 38, జోస్ బట్లర్ (సి)రికెల్టన్ (బి)ముజీబ్ 39, షారుక్ ఖాన్ (సి)తిలక్ వర్మ (బి)హార్దిక్ పాండ్యా 9, రూథర్‌ఫోర్డ్ (సి)సాంట్నర్ (బి)చాహర్ 18, తెవాటియా (రనౌట్) హార్దిక్ 0, రషీద్ ఖాన్ (సి)హార్దిక్ (బి)సత్యనారాయణ రాజు 6, కగిసో రబడా (నాటౌట్) 7, సాయి కిశోర్ (రనౌట్) రికెల్టన్) 1, అదనం 15. (20ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 196పరుగులు.

**వికెట్ల పతనం:** 1/78, 2/129, 3/146, 4/179, 5/179, 6/179, 7/194, 8/195

**బౌలింగ్:** బౌల్ట్ 4-0-34-1, దీపక్ చాహర్ 4-0-39-1, ముజీబ్-ఉర్-రెహ్మాన్ 2-0-28-1, హార్దిక్ పాండ్యా 4-0-29-2, సాంట్నర్ 3-0-25-0, సత్యనారాయణ రాజు 3-0-40-1.

**ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్:** రోహిత్ (బి)సిరాజ్ 8, రికెల్టన్ (బి)సిరాజ్ 6, తిలక్ వర్మ (సి)తెవాటియా (బి)ప్రసిధ్ 39, సూర్యకుమార్ (సి)శుభ్‌మన్ (బి)ప్రసిధ్ 48, రాబిన్ మింజ్ (సి)ఇషాంత్ (బి)సాయికిశోర్ 3, హార్దిక్ (సి)సిరాజ్ (బి)రబడా 11, నమన్ ధీర్ (నాటౌట్) 18, సాంట్నర్ (నాటౌట్) 18, అదనం 9 (20ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 160 పరుగులు.

**వికెట్ల పతనం:** 1/8, 2/35, 3/97, 4/108, 5/120, 6/124

**బౌలింగ్:** సిరాజ్ 4-0-34-2, రబడా 4-0-42-1, ఇషాంత్ శర్మ 2-0-17-0, రషీద్ ఖాన్ 2-0-10-0, సాయి కిశోర్ 4-0-37-1, ప్రసిధ్ కృష్ణ 4-0-18-2,

**ఐపిఎల్‌లో నేడు**
ఢిల్లీ క్యాపిటల్స్ × సన్‌రైజర్స్
వేదిక: విశాఖపట్నం; రాత్రి 7.30గం॥లకు





## ఉగాది శోభ

మామిడి పిందెల పూత
కమ్మని కోయిల కూత
అందాల వేప పూత
గంధాల ప్రకృతి మాత

ఉషస్సుల వెలుగు బాట
యశస్సుల తెలుగు తోట
సంప్రదాయాల తేట
తెలుగింటి సంస్కృతి కోట

మామిడి తోరణాలు
మంగళ వాయిద్యాలు
పూర్ణ కుంభ స్వాగతాలు
పంచాంగ శ్రవణాలు

షడ్రుచుల ఆస్వాదనాలు
సమ భావ దర్శనాలు
కవుల కవితా గానాలు
పురస్కార ప్రదానాలు

వెన్నంటి మనసుండగ
సంబరమే మది నిండుగ
అంబరమే తాకేనుగ
అదే ఉగాది పండుగ

కొత్త బట్టలు ధరించగ
నిరాశలు నేల రాల్చగా
చిగురాశలే చిగురించగా
ఆ ఆమనే అరుదెంచెగా

సమ భావన చూపించగా
సర్వ జనులు సుఖించెగా
సర్వ జీవులు బతికింపగా
విశ్వా వసు కొలువుండెగా

- గుండాల నరేంద్రబాబు,
తెలుగు సాహిత్య పరిశోధకులు
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి,
94932 35992.

## ఉగాది



వచ్చే వచ్చే కొత్త ఏడు
తెచ్చే తెచ్చే ఆశలు బోలెడు
తెలుగింట సంబరం తాకేను
అంబరం

షడ్రుచులను తెచ్చేనంట మన
ఉగాది
జీవిత గమనాలకు అవే పునాది

బెల్లమేమో తీపికి గుర్తు అంట,
జీవితమంతా అవ్వాలి తియ్యని
పంట..

చింతాకేమో పులుపుకు చిహ్నం
అంట,
నేర్పుగా ఉండాలని నేర్పేనంట..

మిరపేమో కారానికి గుర్తు అంట
కష్టాన్ని ధైర్యంగా
ఎదురించాలంట..

ఉప్పేమో ఉత్సాహానికి చిహ్నం
అంట
నూతన ఉత్తేజాన్ని నింపేనంట..

వేప పువ్వు చేదుకు గుర్తు అంట,
చెడు నుండి మంచిని వేరు
చేసేనంట..

లేత మామిడి వగరుకు చిహ్నం
అంట,
ఎదురయ్యే సవాళ్లను
ఎదురించేనంట..
తెలుగింట సంబరం-తాకేను
అంబరం

- ఇమంది అశోక్ కుమార్,
ఎస్జీటీ,
93928 69899.

## మనీషాకు స్వర్ణం

● ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్



**అమ్మాన్(జోర్డాన్):** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో మనీషా భన్వాలా స్వర్ణ పతకం సాధించింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో మనీషా 8-7పాయింట్ల తేడాతో నార్త్ కొరియాకు చెందిన కిమ్‌ను చిత్తుచేసింది. ఈ పోటీల్లో భారత్‌కు స్వర్ణ పతకం లభించడం ఇదే ప్రథమం. ఇక అంతిమ్ పంగల్ కాంస్య పతకంతో మెరిసింది. శుక్రవారం రాత్రి జరిగిన 53కిలోల మహిళల విభాగంలో ప్రపంచ రెజ్లింగ్ కాంస్య పతక విజేత అంతిమ్ పతకాన్ని ఖాయం చేసుకుంది. తొలి బౌట్‌లో అంతిమ్ 10-6పాయింట్ల తేడాతో చైనాకు చెందిన జిన్ జెంగ్‌ను, క్వార్టర్‌ఫైనల్లో జపాన్‌కు చెందిన మియో కియోకాను ఓడించింది. ఇక కాంస్య పతక పోటీలో అంతిమ్ చైనీస్ తైపీకి చెందిన మెగ్ హుసాన్‌పై 10-0పాయింట్ల విజయం సాధించింది. ఆ తర్వత కొరియాకు చెందిన హన్బిట్ చేతిలో ఓటమిపాలైంది. దీంతో సెమీస్‌లో ఓడిన అంతిమ్‌కు కాంస్య పతకం ఖాయమైంది.

## తొలి వన్డేలో న్యూజిలాండ్ గెలుపు

### పాకిస్తాన్‌తో సిరీస్

**నేపియర్:** పాకిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 73పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మార్క్ ఛాప్మన్(136) సెంచరీకి తోడు మిచెల్(76) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 344పరుగుల భారీస్కోర్ చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పాకిస్తాన్ జట్టు 44.1ఓవర్లలో 271పరుగులకే కుప్పకూలింది. అఘా సల్మాన్(58), బాబర్(78)కి తోడు షఫీక్(36), ఉస్మాన్(39) బ్యాటింగ్‌లో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఛాప్మన్‌కు దక్కింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0 ఆధిక్యతలో నిలువగా.. రెండో వన్డే హామిల్టన్ వేదికగా బుధవారం జరగనుంది. ఇరుజట్ల మధ్య జరిగిన ఐదు టి20ల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు 4-1తో చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.

# అంతర్జాతీయ విద్యార్థులపై 'స్వీయ బహిష్కరణ' వేటు

- వీసాలు రద్దు చేస్తున్న ట్రంప్ ప్రభుత్వం
- క్యాంపస్ కార్యకలాపాల సాకుతో చర్యలు
- సోషల్ మీడియా పోస్టుల పైనా నిఘా...లైక్ కొట్టినా ఇంటికే

**వాషింగ్టన్ :** అమెరికాలో విద్యాభ్యాసం చేసున్న వందలాది మంది అంతర్జాతీయ విద్యార్థులపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 'స్వీయ బహిష్కరణ' వేటు వేస్తోంది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ నుండి విద్యార్థులకు ఈ మెయిల్స్ వస్తున్నాయి. వారిలో కొందరు భారతీయ విద్యార్థులు కూడా ఉండే అవకాశం ఉందని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు తెలిపారు. 'మీ ఎఫ్-1 వీసాల (విద్యార్థి వీసాలు)ను రద్దు చేశాం. మిమ్మల్ని దేశం నుండి బహిష్కరించాం. కాబట్టి మీ అంతట మీరు దేశం విడిచి వెళ్లిపోండి' అంటూ ఆ ఈ మెయిల్ సందేశంలో బాంబు పేల్చారు. 300 మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రకటించారు.

రాజకీయ, పర్యావరణ, ఆర్థిక, సామాజిక మార్పుల కోసం విద్యార్థులు తమ క్యాంపస్‌లలో కొన్ని కార్యక్రమాలు చేపడుతుంటారు. ప్రజాస్వామ్యం, పౌర హక్కులు వంటి అంశాలపై ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తారు. వీటిని 'క్యాంపస్ యాక్టివిజం'గా వ్యవహరిస్తారు. ఇలాంటి చర్యలకు పాల్పడడంతోపాటు సామాజిక మాధ్యమాలలో దేశ వ్యతిరేక పోస్టులు పెడుతున్నారన్న కారణంతో అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం 'స్వీయ బహిష్కరణ' వేటు వేస్తోంది. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను లైక్ చేసిన వారిపై కూడా బహిష్కరణ పిడుగు పడుతోంది.



అమెరికా కక్షసాధింపు చర్యలను నిరసిస్తూ మసాచుసెట్స్‌లో ఆందోళన చేస్తున్న పిహెచ్‌డి విద్యార్థులు

### మాకు ఆ హక్కుంది

హమాస్, ఇతర ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇస్తున్న విద్యార్థులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవడానికి రుబియో ఇటీవలే 'క్యాచ్ అండ్ రివోక్' అనే కృత్రిమ మేథ ఆధారిత యాప్‌ను ప్రారంభించారు. ఈ యాప్ ప్రారంభించిన మూడు వారాల వ్యవధిలోనే మూడు వందల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేశారు. 'స్వీయ బహిష్కరణ వేటుపడిన అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుంది. ప్రతిరోజూ ఈ చర్యలు కొనసాగుతాయి. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు. వారి వీసాలను రద్దు చేస్తాం' అని స్పష్టం చేశారు. 'ఎవరు రావాలో, ఎవరు రాకూడదో నిర్ణయించే అధికారం ప్రతి దేశానికీ ఉంటుంది' అని అన్నారు. సోషల్ మీడియా పోస్టుల పరిశీలన ఆధారంగా అంతర్జాతీయ విద్యార్థులపై స్వీయ బహిష్కరణ వేటు పడుతోంది. అకడమిక్ స్టడీ వీసా (ఎఫ్), ఒకేషనల్ స్టడీ వీసా (ఎం), ఎక్స్ఛేంజ్ వీసా (జె).... ఇలా ఏ వీసా కోసమైనా కొత్తగా దరఖాస్తు చేసే వారి సోషల్ మీడియా పోస్టులను కూడా జల్లెడ పడతారు. అమెరికా ఉగ్రవాద గ్రూపులుగా ప్రకటించిన వారికి మద్దతు ఇస్తున్నట్లు తేలితే యుఎస్‌ఎలో చదువుకోకుండా దరఖాస్తుదారులను నిషేధిస్తారు. ఓ తాజా నివేదిక ప్రకారం అమెరికాలో 11 లక్షల మంది అంతర్జాతీయ విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. వీరిలో 3.31 లక్షల మంది భారతీయ విద్యార్థులే.

### ఈ మెయిల్‌లో ఏముంది?

'అమెరికా విదేశాంగ శాఖ తరపున బ్యూరో ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ వీసా కార్యాలయం తెలియజేస్తున్న విషయమేమంటే మీకు వీసా జారీ చేసిన తర్వాత కొంత అదనపు సమాచారం లభించింది. దాని ఆధారంగా అమెరికా ఇమ్మిగ్రేషన్-నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 221 (ఐ) ప్రకారం మీ ఎఫ్-1 వీసాను రద్దు చేస్తున్నాము. ఈ విషయాన్ని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి తెలియజేశాము. వారు మీ వీసా రద్దు సమాచారాన్ని మీరు విద్యాభ్యాసం చేస్తున్న సంస్థకు తెలియజేస్తారు. చట్టబద్ధమైన ఇమ్మిగ్రేషన్ హోదా లేకుండా అమెరికాలో నివసిస్తే జరిమానా, నిర్బంధం, తిప్పిపంపడం వంటి చర్యలు చేపట్టవచ్చు. భవిష్యత్తులో అమెరికా వీసా పొందడానికి మీరు అనర్హులు కూడా కావచ్చు. స్వీయ బహిష్కరణ వేటు పడిన వారు అమెరికాలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకూడదని గమనించండి. మిమ్ములను మీ స్వదేశానికి కాకుండా ఇతర దేశాలకు పంపవచ్చు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వీసా రద్దయిన వారు సిబిపి హోమ్ యాప్‌ను ఉపయోగించి అమెరికాను వదిలి వెళ్లేందుకు తమ సుముఖత తెలియజేయవచ్చు. అమెరికాను వదలబోయే ముందు మీ పాస్‌పోర్టును వ్యక్తిగతంగా అమెరికా రాయబార కార్యాలయంలో కానీ, వీసా జారీ చేసిన కాన్సులేట్‌లో కానీ విధిగా సమర్పించాలి. వారు దానిని భౌతికంగా రద్దు చేస్తారు. వీసా రద్దయినందున దానిని ఉపయోగించేందుకు ప్రయత్నించకూడదు. భవిష్యత్తులో అమెరికా రావాలని అనుకుంటే మరో వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలి. మీరు వీసాకు అర్హులా కాదా అనే విషయాన్ని ఆ సమయంలో నిర్ధారిస్తారు' అని అంతర్జాతీయ విద్యార్థులకు పంపిన ఈ మెయిల్స్‌లో వివరించారు.

### స్క్రీన్‌షాట్లను భద్రపరచండి

ఈ నెల 25వ తేదీ నుండే విద్యార్థులకు ఈ మెయిల్స్ పంపుతున్నారని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు తెలిపారు. ఇప్పటికే అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారి సోషల్ మీడియా ఖాతాలను కూడా పరిశీలించాలని రుబియో ఆంతరంగిక ఆదేశాలు జారీ చేశారు. అమెరికా వీసాలు పొందడం జన్మహక్కుగా భావించకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారు దేశం విడిచి వెళ్లిపోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. 'సోషల్ మీడియా పోస్టులను క్షుణ్ణంగా పరిశీలించండి. అవమానకరమైన సమాచారం కన్పిస్తే వాటి స్క్రీన్‌షాట్లు తీసి భద్రపరచాలి. దరఖాస్తుదారులు తమ పోస్టులను తొలగించేందుకు, మార్చేసేందుకు ప్రయత్నించే అవకాశం ఉన్నందున వాటిని జాగ్రత్తగా భద్రపరచాల్సి ఉంటుంది' అని ఆయన తన ఆదేశాలలో కాన్సులర్ అధికారులకు సూచించారు.



## స్టార్టప్ రంగంలో గణనీయమైన అభివృద్ధి

- ఐటి రంగంలోనూ కృషి
- స్కిల్ సమ్మిట్ సర్క్యూట్ ప్రారంభోత్సవంలో కేరళ సిఎం పినరయి విజయన్

**తిరువనంతపురం :** స్టార్టప్ రంగంలో కేరళ చాలా అభివృద్ధిని సాధించిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. గత తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో 6,200 స్టార్టప్‌లను ప్రారంభించామని చెప్పారు. గ్రూప్ ఆఫ్ టెక్నాలజీ కంపెనీస్ (జిటెక్) నిర్వహించిన 'స్కిల్ సమ్మిట్ సర్క్యూట్ 2025'ను శనివారం ప్రారంభించారు. తిరువనంతపురంలో జరుగుతున్న ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ, 2016లో తాము స్టార్టప్ విధానాన్ని రూపొందించామని, దేశంలో ఏ రాష్ట్రమూ ఈ విధమైన విధానాన్ని రూపొందించలేదని చెప్పారు. మొట్టమొదటిసారిగా కేరళనే ఈ రకమైన విధానాన్ని రూపొందించిందన్నారు. దేశంలో స్టార్టప్‌లకు సంబంధించి అత్యంత స్నేహపూర్వకమైన వాతావరణం కేరళలో వుందన్నారు. ఈ రంగంలో కేరళ 254శాతం వృద్ధిని సాధించిందన్నారు. అదే సమయంలో ప్రపంచ సగటు కేవలం 46శాతం మాత్రమేనని విజయన్ పేర్కొన్నారు. కేరళ సాంకేతిక అభివృద్ధిలో ఈ కార్యక్రమం కీలకమైనదని, ఇక్కడ జరిగే చర్చలు ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడానికి దోహదపడతాయని నమ్ముతున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో భాగంగా 'మాదకద్రవ్యాల రహిత కేరళ' కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నందుకు సంతోషంగా వుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిభా, నైపుణ్యాలకు కేరళను కేంద్రంగా మార్చగల సామర్థ్యం ఇక్కడకి వచ్చిన వారికి వుందని, ఈ సదస్సులో చర్చలు ఆ దిశగా సాగాలి' అని ఆయన సూచించారు.

స్టార్టప్ రంగంలో చర్యలు తీసుకున్నట్లుగానే ఐటి రంగంలోనూ ప్రభుత్వం ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఫలితంగా ఐటి పార్కుల్లో ఉద్యోగుల సంఖ్య రెట్టింపు కంటే పెరిగిందన్నారు. రాష్ట్రంలో స్టార్టప్, ఐటి రంగాలు గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నాయంటే కేరళ యువత ప్రతిభే నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా వ్యాపార కార్యకలాపాలకు కేరళ అనుకూలంగా లేదని వస్తున్న ప్రతికూల వ్యాఖ్యలను, విమర్శలను రాష్ట్రం అధిగమిస్తోందని చెప్పారు. పారిశ్రామిక రంగంలో కూడా పురోగతి సాధిస్తున్నామన్నారు.

## జస్టిస్ వర్మకు 'నో వర్క్' : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. న్యాయవాదుల నిరసనల నేపథ్యంలో జస్టిస్ వర్మ బదిలీపై పునఃపరిశీలన జరుపుతానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా వివిధ బార్ అసోసియేషన్లకు హామీ ఇచ్చి 24 గంటలు కూడా గడవక ముందే కేంద్రం ఈ నోటిఫికేషన్ జారీ చేయడం అనేకమందిని ఆశ్చర్యపరచింది. జస్టిస్ వర్మకు ప్రస్తుతానికి ఎలాంటి బాధ్యతలు అప్పగించవద్దని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సూచించినట్లు సుప్రీంకోర్టు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది.

జస్టిస్ వర్మపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదేశాలు జారీ చేసేందుకు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీం బెంచ్ నిరాకరించింది. ఆంతరంగిక దర్యాప్తు జరుగుతోందని, అది ముగిసిన తర్వాత ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం తీసుకుంటారని తెలిపింది.

## వియత్నాంలో స్కోడా అసెంబుల్ యూనిట్ ఏర్పాటు

**న్యూఢిల్లీ :** వియత్నాంలో స్కోడా కుషాక్, స్లావియాను అసెంబుల్ చేయడానికి ప్లాంట్‌ను ప్రారంభించినట్లు లగ్జరీ కార్ల కంపెనీ స్కోడా ఆటో వెల్లడించింది. ఇందుకోసం అక్కడి ప్రాంతీయ భాగస్వామి ఇన్వెస్టర్ థాన్ కాంగ్ గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. భారత్ నుండి దిగుమతి చేసుకున్న కంప్లీట్లీ నాక్డ్ డౌన్ కిట్‌ల నుండి వాహనాలను అసెంబుల్ చేయనున్నట్లు స్కోడా వెల్లడించింది. వియత్నంలో ప్రస్తుతం 15 స్కోడా విక్రయ కేంద్రాలున్నాయని.. ఈ ఏడాది ముగింపు నాటికి 32కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్కోడా ఆటో సిఇఒ క్లాస్ జెల్మెర్ పేర్కొన్నారు.

## భారత్‌లో ఇన్ కార్ ఉత్పత్తుల తయారీ

- పయనీర్ వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత్‌లో ఇన్ కార్ ఉత్పత్తుల తయారీని ప్రారంభించనున్నట్లు జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ పయనీర్ కార్పొరేషన్ వెల్లడించింది. ఇందుకోసం 2023లో ఇక్కడ ఒక ఆర్అండ్‌డి సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపింది. కాగా.. 2026 నుంచి తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నామని పయనీర్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సిఇఒ షిరో యహరా తెలిపారు. ఇది భారత్‌లో తమ ఉనికిని మరింత బలపర్చనుందన్నారు. "ఫ్యూచర్ ఆఫ్ మొబిలిటీ ఎక్స్ పీరియన్స్" అనే కార్పొరేట్ విజన్‌తో ముందుకు సాగుతున్నామన్నారు. ఇక్కడి ఆటోమొబైల్ సంస్థలతో తమ వ్యాపారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఇది అద్భుతమైన అవకాశాన్ని ఇవ్వనుందన్నారు.

## పసిడి ధర రూ.96వేలకు చేరొచ్చు..!

**న్యూఢిల్లీ :** అమెరికా టారిఫ్ యుద్ధానికి తోడు అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి వల్ల 2025 ద్వితీయార్థంలో 10 గ్రాముల బంగారం ధర రూ.96,000కు చేరొచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ అంచనా వేసింది. ప్రథమార్థంలో రూ.87,000 నుంచి రూ.90,000గా నమోదుకావొచ్చని పేర్కొంది. ద్వితీయార్థంలో రూ.94,000-96,000 మధ్య ఉండొచ్చని విశ్లేషించింది. భారత్‌లో పసిడి పెట్టుబడి మాత్రమే కాదని.. పెళ్లిళ్లు, పండగలకు అంతర్గత సాంప్రదాయానికి సూచికని పేర్కొంది. ఇటీవల వరుసగా పెరుగుతోన్న బంగారం ధరలు కొనుగోళ్లను దెబ్బతీస్తున్నాయని తెలిపింది.

## యూనస్ ప్రభుత్వంపై కుట్ర ?

- బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై సిఐడి కేసు
- మరో 72మందిపైనా ఎఫ్‌ఐఆర్

**ఢాకా :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై సిఐడి కేసు నమోదు చేసింది. యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్ర పన్నారనే ఆరోపణలపై ఆమెపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. షేక్ హసీనాతోపాటు మరో 72 మందిపై కూడా సిఐడి అధికారులు కేసు నమోదు చేశారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ఈ కేసుపై విచారణ ప్రారంభించాలని సిఐడిని ఆదేశించింది.

రిజర్వేషన్లపై విద్యార్థి లోకం జరిపిన ఆందోళనలతో హసీనా ప్రభుత్వం కూలిపోయింది. ఆమె దేశం విడిచి పారిపోవడంతో మహమ్మద్ యూనస్ నేతత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. గతేడాది డిసెంబర్ 19న హసీనా నేతత్వంలో ఆన్‌లైన్ మీటింగ్ జరిగింది. జాయ్ బంగ్లా బ్రిగేడ్ అనే పేరుతో షేక్ హసీనాతో పాటు ఇతరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న యూనస్ ప్రభుత్వాన్ని పడగొట్టి మళ్లీ హసీనా ప్రభుత్వాన్ని ఎలా పునరుద్ధరించాలనే విషయమై ఈ సమావేశంలో చర్చలు జరిపినట్లు తెలిసింది. ఈ సమాచారం సిఐడి దృష్టికి వెళ్లడంతో అధికారులు హసీనాతో పాటు మరో 72 మందిపై కేసు నమోదు చేశారు. ఈ మీటింగ్‌లో పాల్గొన్నవారి వాయిస్ రికార్డింగ్‌లు కూడా వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వంలో ప్రశాంతత లేకుండా చేయాలని ఈ సమావేశంలో పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేసినట్లు బంగ్లాదేశ్ స్థానిక మీడియా వెల్లడించింది.

## సొంత కంపెనీకే 'ఎక్స్'ను అమ్మేసిన ఎలన్ మస్క్

**వాషింగ్టన్ :** ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'ఎక్స్' (గతంలో ట్విట్టర్)ను విక్రయించినట్లు ఎలన్ మస్క్ వెల్లడించారు. అయితే దీన్ని తన సొంత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ అయినటువంటి 'ఎక్స్‌ఎఐ'కే 33 బిలియన్ల డాలర్ల (దాదాపు రూ.2.82 లక్షల కోట్లు)కు అమ్మేసినట్లు 'ఎక్స్' వేదికగా మస్క్ ప్రకటించారు. ఈ లావాదేవీ పూర్తిగా స్టాక్ రూపంలో జరిగిందన్నారు. తాజా స్వాధీనంతో ఎక్స్‌ఎఐ విలువను 80 బిలియన్ డాలర్లుగా నిర్ధారించారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను 44 బిలియన్ డాలర్ల (రూ.3.76 లక్షల కోట్లకు)కు ఎలాన్ మస్క్ కొనుగోలు చేశారు. ఆ సంస్థలతో అనేక మార్పులు చేయడంతో పాటుగా ట్విట్టర్ పేరును కూడా ఎక్స్‌గా మార్చారు. దాదాపు 75 శాతం మంది ఉద్యోగులను తొలగించి వారిని రోడ్డున పడేశారు. చాట్‌జిపిటికి పోటీగా గతేడాది మస్క్ 'ఎక్స్‌ఎఐ'ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎక్స్‌ఎఐ అధునాతన ఎఐ సామర్థ్యాన్ని, ఎక్స్‌కు అనుసంధానించడం ద్వారా ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని మస్క్ తన పోస్టులో పేర్కొన్నారు.

## గాజాలో తాజా దాడుల్లో 21మంది మృతి

- బీరుట్‌పై దాడులు
- సహాయక చర్యల కోసం వెళ్లిన 14మంది మృతదేహాలు లభ్యం
- పెచ్చుమీరుతోన్న ఇజ్రాయిల్ దాష్టీకాలు


అమెరికా మద్దతుతో గాజాలో మహిళలు, పిల్లలపై ఇజ్రాయిల్ దాష్టీకాలను నిరసిస్తూ కలకత్తాలో ఆందోళన చేస్తున్న ఐద్వా కార్యకర్తలు

**గాజా :** తాజా దాడుల్లో గాజాలో 21మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో దక్షిణ గాజాలో 13మంది చనిపోగా, బెయిట్‌లాహియాలో ఆరుగురు చనిపోయారు. వీరిలో ముగ్గురు మహిళలు వున్నారు. సహాయక చర్యలు చేపట్టేందుకు వెళ్లి అదృశ్యమైన 14మంది వారం రోజుల తర్వాత శవాలుగా తేలారు. దక్షిణ రాఫా నగరంలో ఆ 14మందిని చంపేసి వారి అంబులెన్సులతో సహా దగ్ధం చేశారని సాక్షులు తెలిపారు. చారిటీ కిచెన్‌ల ముందు ఆహారం కోసం బారులు తీరి నిలుచున్న వారిపై ఇజ్రాయిల్ డ్రోన్లతో దాడులకు దిగుతోంది. ఇప్పటికే డజన్ల సంఖ్యలో చారిటీ కిచెన్‌లను నాశనం చేసిన ఇజ్రాయిల్ మిలటరీ ఆహార పంపిణీ కేంద్రాలను కూడా ధ్వంసం చేస్తోంది. ఒక పద్ధతి ప్రకారం కృత్రిమంగా కరువును సృష్టించి ప్రజలను ఆకలి బాధలతో చనిపోయేలా చూస్తోందని హమాస్ విమర్శిస్తోంది. ఈ నెల 18న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకు 921మంది చనిపోయారు. గత నవంబరులో హిజ్బుల్లాతో కాల్పుల విరమణకు అంగీకరించిన తర్వాత మొదటిసారిగా బీరుట్ నగరంపై ఇజ్రాయిల్ బాంబు దాడులకు తెగబడింది. ఇప్పటికి మూడు వారాలకు పైగా ఆహార సాయాన్ని నిలిపివేయడంతో గాజాలో వందలు వేల సంఖ్యలో పాలస్తీనియన్లు తీవ్రమైన క్షుద్బాధను ఎదుర్కొంటున్నారు. బాంబుల వర్షం కురిపిస్తుండడంతో ఆహారం, నీరు, మందులు, గ్యాస్, విద్యుత్, ఆశ్రయం ఇలా ఏదీ అందుబాటులో వుండడం లేదని, జీవనం అత్యంత దుర్భరంగా మారిందని గాజావాసులు వాపోతున్నారు.

## మాజీ న్యాయమూర్తి నిర్మల్ యాదవ్ నిర్దోషి

- 17ఏళ్ల నాటి అవినీతి కేసులో సిబిఐ కోర్టు తీర్పు

**చండీగఢ్ :** జడ్జి ఇంటి వద్దకు డబ్బు ప్యాకెట్ కేసులో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నిర్మల్ యాదవ్ నిర్దోషి అని చండీగఢ్‌లోని ప్రత్యేక సిబిఐ కోర్టు శనివారం తీర్పు ఇచ్చింది. మరో ముగ్గురు నిందితులను కూడా నిర్దోషులుగా ప్రకటించింది. మరో నిందితుడు సంజీవ్ బన్సాల్ కేసు విచారణ సమయంలో మరణించాడు. 17 ఏళ్ల నాటి అవినీతి కేసుపై సిబిఐ ప్రత్యేక కోర్టు అదనపు సెషన్స్ జడ్జి జస్టిస్ అల్కా మాలిక్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2008 ఆగస్టు 13న నాటి పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ నివాసానికి ప్రకాశ్ రామ్ అనే వ్యక్తి వచ్చి, ఢిల్లీ నుంచి వచ్చిన పత్రాలు ఉన్నాయంటూ ఒక ప్యాకెట్ ఇచ్చాడు. ఆ ప్యాకెట్‌ను తెరిచి చూడాలని తన ప్యూన్‌కు జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ చెప్పారు. దానిని తెరిచి చూడగా రూ.15 లక్షల నోట్ల కట్టలు బయటపడ్డాయి. జస్టిస్ నిర్మల్ యాదవ్ నివాసానికి బదులు జస్టిస్ నిర్మల్‌జిత్ కౌర్ ఇంటికి ఆ డబ్బు ప్యాకెట్ చేరినట్లు తెలిసింది. దీంతో ప్రకాశ్‌రామ్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. నాటి గవర్నర్ ఎస్‌ఎఫ్ రోడ్రిగ్స్ పాలనా యంత్రాంగం ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించింది. హర్యానా మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ సంజీవ్ బన్సాల్ తన ప్యూన్ ప్రకాశ్‌రామ్ ద్వారా రూ.15 లక్షల డబ్బును జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు పంపినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఉత్తరాఖండ్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ నిర్మల్ యాదవ్ పదవీ విరమణ రోజైన 2011 మార్చి 4న సిబిఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది.

## మోడీ ఆశ్రిత పక్షపాతం వల్లే బ్యాంకింగ్ రంగంలో సంక్షోభం!

- మిత్రులకు రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు



**న్యూఢిల్లీ :** బిజెపి ప్రభుత్వం ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. శత కోటీశ్వరులైన తన మిత్రులకు మోడీ ప్రభుత్వం ఏకంగా 16 లక్షల కోట్ల రూపాయలను రుణమాఫీ చేసిందన్నారు. దీనిపై రాహుల్ తాజాగా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆశ్రితవాదం, ఆర్థిక దుర్వినియోగం కలిసి భారతదేశ బ్యాంకింగ్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది. దీనివల్ల జూనియర్ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతోంది, వారిపై ఒత్తిడి పెరుగుతోంది, వారు తీవ్రమైన పర్యవసానాలను ఎదుర్కొనాల్సి వస్తోందని రాహుల్ మండిపడ్డారు.

తనను కలిసిన ఐసిఐసిఐ బ్యాంకు ఉద్యోగుల ప్రతినిధి బృందంతో మాట్లాడిన రాహుల్ వారి ఆవేదనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇటీవల 782 మంది ఐసిఐసిఐ బ్యాంకు ఉద్యోగులు తనని పార్లమెంటులో కలిసి తమ సమస్యలను వివరించారన్నారు. అనైతిక రుణాల్ని మంజూరు చేసినందుకు, వాటికి అవలంబించిన పద్ధతులను బహిర్గతం చేసినందుకు బ్యాంకు ఉద్యోగులపై ప్రతీకార చర్యలుగా బలవంతపు బదిలీలు, వేధింపులకు గురిచేస్తున్నట్లు వారు తెలియచేశారన్నారు. బ్యాంకు ఉద్యోగుల అనుభవాలు తనను ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. ఇలాంటి ఒత్తిడి ఇద్దరు ఉద్యోగులు ఆత్మహత్యకు పాల్పడేందుకు దారి తీసిందని చెప్పారు.
ఈ సమస్య కేవలం ఐసిఐసిఐ బ్యాంకుది మాత్రమే కాదని, అనేకమంది బ్యాంకింగ్ నిపుణులను ప్రభావితం చేస్తోందన్నారు. ఆర్థిక దుర్వినియోగాలకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వం ఉద్యోగుల ప్రాణాల్ని బలి తీసుకుంటోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా వేలాదిమంది నిజాయితీపరులైన నిపుణులను ప్రభావితం చేసే అత్యంత ఆందోళనకరమైన అంశమిదని అన్నారు. పని ప్రదేశంలో వారు ఎదుర్కొంటున్న వేధింపులు, వారి సమస్యలపై పోరు సల్పుతామని రాహుల్ తెలిపారు.

## ప్రవీణ్ చేతులు, ముఖంపై గాయాలు

మొదటిపేజీ తరువాయి

అనుభవంగల రెండు ప్రత్యేక పోలీసు అధికారుల బృందాలను ఏర్పాటు చేశామని, మరింత లోతుగా సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. త్వరలో పూర్తి స్థాయి పోస్టుమార్టం రిపోర్ట్ వైద్యులు విడుదల చేస్తారని, దాన్నిబట్టి పూర్తి నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఎటువంటి వదంతులూ, నిరాధార, సత్యదూర విశ్లేషణ కథనాలూ ప్రచారం చేయరాదన్నారు. అటువంటి ప్రచారాల వల్ల ప్రజల్లో లేనిపోని అపోహలు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాంశాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాస్టర్ ప్రవీణ్‌ను ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ బెదిరించిన సాక్ష్యాలు, వీడియోలు, ఎటువంటి ఆధారాలూ ఉన్నా సిట్ ఇన్‌ఛార్జ్, కొవ్వూరు డిఎస్‌పి దేవకుమార్ ఫోన్ నెంబర్ 9440796620కు పంపాలని ఐజి కోరారు. ఎస్‌పి నరసింహ కిషోర్ మాట్లాడుతూ కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్, విజయవాడలో సిసి కెమెరాల డేటా పరిశీలిస్తున్నామని తెలిపారు. అన్ని టోల్ గేట్ల వద్ద సిసి పుటేజీ తీసుకున్నామని, రాజమహేంద్రవరం ఎలా వచ్చారో పరిశీలించామన్నారు.

లాలాచెరువు సమీపంలో ప్రవీణ్ తన కుమార్తె పేరిట కొంత స్థలం కొనుగోలు చేసినట్టు తెలిసిందని, అక్కడ భవనం నిర్మించాలనుకున్నారని చెప్పారు. దీనికోసం ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారని తెలిపారు. ప్రవీణ్ రాజమహేంద్రవరం వస్తున్నట్లు ఆయన భార్యకు, స్థానికంగా ఉంటున్న ఆకాష్, జాన్‌కు మాత్రమే తెలుసని చెప్పారు. కుటుంబ సభ్యులందరినీ విచారించామని ఎస్‌పి తెలిపారు.

## అమెరికా, ఎఫ్‌టిఎలతో వాణిజ్య చర్చలను ఉపసంహరించుకోవాలి

- ఎఐకెఎస్ డిమాండ్
- ఆందోళనలకు పిలుపు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

అమెరికా, ఎఫ్‌టిఎలతో వాణిజ్య చర్చలను ఉపసంహరించుకోవాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. శనివారం ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్ ప్రకటన విడుదల చేశారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో వ్యవసాయం, పాడి పరిశ్రమ, చేపలు పట్టడంలో ఒప్పందాలు వద్దని తెలిపారు. సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ఆస్కారం ఇవ్వడం ఆపాలని, వాన్స్ గో బ్యాక్, ఇండియా అమ్మకానికి లేదని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం యూరోపియన్ యూనియన్, న్యూజిలాండ్, ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ముగింపు కోసం అలాగే 14 దేశాలతో కూడిన ఇండో-పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రోస్పెరిటీ వంటి మెగా ఎఫ్‌టిఎల కోసం చర్చలను వేగవంతం చేస్తోందని విమర్శించారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు ప్రధాని మోడీ లొంగిపోయి, యుఎస్ ఉత్పత్తులకు సుంకం, నాన్-టారిఫ్ అడ్డంకులను తగ్గించేందుకు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. యుఎస్ వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ ఇండియా తన వ్యవసాయ మార్కెట్‌ను తెరవాలని, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చల్లో వ్యవసాయం భాగంగా ఉండాలని నొక్కి చెప్పారు. సున్నా సుంకం వద్ద స్థిర పరిమాణంలో కాయధాన్యాల దిగుమతి కోసం ఆస్ట్రేలియాతో చేసుకున్న ఒప్పందానికి అనుగుణంగా నిర్దిష్ట పరిమాణంలో కాయధాన్యాలు, బఠానీల దిగుమతులపై జీరో-డ్యూటీ ఫ్రేమ్‌వర్క్‌కు ఇండియా ఇప్పటికే సంసిద్ధతను వ్యక్తం చేసినట్లు తెలిసిందని అన్నారు. అమెరికన్ రైతులకు భారీ సబ్సిడీల సందర్భంలో ఏదైనా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకుంటే, అది చాలా అసమానంగా ఉంటుందని పేర్కొన్నారు.

సుంకాలు, మార్కెట్ పరిమితులను ఎత్తివేస్తే ఇండియాకు అమెరికా డెయిరీ ఎగుమతులు భారీగా పెరుగుతాయని, కాబట్టి చర్చలో ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం పాడి రైతుల మరణానికి కారణమవుతుందని అన్నారు. ఈ ముప్పు కేవలం పాడి పరిశ్రమతో ఆగిపోదని పేర్కొన్నారు. అదే విధంగా, మొక్కజొన్న విషయంలో జన్యుపరంగా మార్పు చెందిన మొక్కజొన్న, ఇథనాల్‌పై ఇండియా దిగుమతి నిషేధాన్ని తొలగించాలనే ఒత్తిడి ఉందని, దీనివల్ల అమెరికాకు 300 మిలియన్ల డాలర్ల వరకు లాభాలు వస్తాయని భావిస్తున్నారని అన్నారు. అమెరికా కంపెనీలు రాజ్యమేలుతాయని పేర్కొన్నారు. సోయాబీన్, బాదం, పిస్తాపప్పు, వాల్‌నట్, ఆపిల్, ఉద్యానవన పంటలన్నీ చర్చలకు సిద్ధంగా ఉన్నాయి.

ఇండియాలో పత్తి రైతులు ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉండి ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ, వార్షిక పత్తి ఉత్పత్తి 2017-18లో 37 మిలియన్ బేళ్ల (ఒక్కొక్కటి 170 కిలోలు) నుండి 2022-23లో 34.7 మిలియన్ బేళ్లకు, 2023-24లో 31.6 మిలియన్ బేళ్లకు మరింత తగ్గుతుందని తెలిపారు. అమెరికా నుండి చౌకైన పత్తి ఇండియా రైతుల మార్కెట్ వాటాను ఆక్రమిస్తుందని, ప్రధాన మంత్రి, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఎవరి ప్రయోజనాలను తీరుస్తుందని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం.. అమెరికా సామ్రాజ్యవాదానికి పూర్తిగా లొంగిపోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు.

## జూన్ నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ 5 జి టవర్లు

- ప్రయివేటు టెల్కోలకు శాటిలైట్ ఇంటర్నెట్ అనుమతులు : కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

**న్యూఢిల్లీ :** ప్రభుత్వ టెలికం కంపెనీ బిఎస్‌ఎన్‌ఎల్ దేశ వ్యాప్తంగా ఒక్క లక్ష 4జి మొబైల్ టవర్లను స్వదేశీ పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిందని కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. వీటిని వచ్చే జూన్ నుంచి 5జిగా మార్చే ప్రక్రియను చేపట్టనున్నామని చెప్పారు. సెప్టెంబర్ 2023 నుంచి 2025 మార్చి 5 మధ్య 83,629 బిఎస్‌ఎన్‌ఎల్ టవర్లను 4జిగా ఆధునీకరించామని ఇటీవలే పార్లమెంట్‌కు మంత్రి తెలిపారు. మరో 74,123 సైట్లను 4జిగా మార్చనున్నామన్నారు. ప్రభుత్వం డైరెక్ట్ టు డివైస్ ఉపగ్రహ సేవలను ప్రారంభించిందని, ఈ సాంకేతికతలో నెట్‌వర్క్‌కు కనెక్ట్ కానప్పుడు కూడా స్మార్ట్‌ఫోన్ నుంచి సందేశాలను పంపొచ్చని అన్నారు. అప్పుడు కనెక్టివిటీ మొబైల్ టవర్ నుంచి కాకుండా ఉపగ్రహం నుంచి నేరుగా అందుతుందన్నారు.

### ఆ రెండింటికి లైసెన్స్..

భారత్‌లో ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. దీని కోసం ఇతర అనేక కంపెనీలు సైతం ఆసక్తిని చూపిస్తున్నాయన్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ కమ్యూనికేషన్ సేవల కోసం ఇప్పటికే రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్‌కు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో నాలుగు టెలికం కంపెనీలు ఉన్నాయన్నారు. 2014లో 90కోట్ల మంది మొబైల్ వినియోగదారులు ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 120 కోట్లకు పైగా పెరిగిందన్నారు. 97 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్‌కు శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించకపోవడంపైనా, ప్రయివేటు టెల్కోలకు స్పెక్ట్రం ఫీజులు, వేలం లేకుండానే ఈ సేవలకు అనుమతులు ఇవ్వడంపై ఆందోళన వ్యక్తమవుతోన్న విషయం తెలిసిందే.

## మొబైల్ యాప్‌తో నీటి వృథాకు అడ్డుకట్ట

- లారిట్జ్ నడ్సన్ నుంచి కొత్త వ్యవసాయ ఆవిష్కరణలు

**హైదరాబాద్ :** వ్యవసాయ రంగంలో ఆటోమేషన్‌ను ప్రోత్సహించేందుకు సరికొత్త కనెక్టెడ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించినట్లు లారిట్జ్ నడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ (గతంలో ఎల్‌అండ్‌టి స్విచ్‌గేర్) వెల్లడించింది. తమ స్మార్ట్‌కామ్ ఇరిగేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎంఎస్) మొబైల్ యాప్ ద్వారా నీరు వృర్థం కావడాన్ని తగ్గించి, దిగుబడులు పెంచేందుకు దోహదం చేస్తోందని ఆ కంపెనీ సిఎఫ్‌ఒ నరేష్ కుమార్ పేర్కొన్నారు. రైతులు వనరులను సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు, ఉత్పాదకతను, దిగుబడులను పెంచుకునేందుకు ఈ వినూత్న ఉత్పత్తులు, సొల్యూషన్స్ తోడ్పడతాయన్నారు. వచ్చే కొన్నాళ్లలో 1.20 లక్షల హెక్టార్ల స్థలంలో 25,000 మంది రైతులు తమ ఈ ఆటోమేటెడ్ వ్యవసాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

# మార్పునకు ఆరంభం ఉగాది

ప్రగతి కేంద్రంగా సాగే ప్రకృతి, ఉగాది పండుగకి ఎక్కడలేని ప్రత్యేకతని తీసుకొస్తుంది. రాలిపోయిన ఆకులను చూసి ఏ చెట్టూ కుంగిపోదు. మోడువారిన చోటే కొత్త చిగుర్లు వేసి మార్పును స్వాగతిస్తుంది. చెట్ల నుండి నేర్చుకోవాల్సింది ఇదే. కోయిలలు తమ కుహూకుహూ గానాల నుండి ఆ మార్పును చూడమని చెబుతాయి. విరబూసిన పూలతో, కాయలతో, పండ్లతో శోభిల్లే కాలం ముందుందని ప్రతి చెట్టూ ఉగాదికి స్వాగతం పలుకుతాయి. చెట్టూ, చేమ.. పాడి, పంట ఉగాది కాలం నుండే కొత్త రూపాలు సంతరించుకుంటాయి. అందుకే ఉగాది ప్రకృతి పండుగ అయ్యింది.



అంతా అయిపోయింది అన్న చోట– 'ఇంకా ఎంతో ఉంది' అని చాటి చెప్పే సందర్భాన్ని వసంతం గుర్తుకుతెస్తుంది. జీవితమంటే – శిశిరంలాంటి ప్రతికూలతతో పోరాడి.. వసంతం వంటి చైతన్యంలోకి ప్రయాణించటమని చాటి చెబుతుంది. శూన్యం ఆవరించింది అనుకున్నా, ఆశ కోల్పోకూడదన్న సంకేతం ఇస్తుంది వసంత కాలం. శిశిరం కమ్మేసిన సుషుప్తావస్థ నుంచి, వసంతమనే మేల్కొలుపు మార్పుకు ఉగాది ఆరంభం.

**ఉగాది పచ్చడి**

ప్రకృతిలో దొరికే సహజ రుచులతో షడ్రుచుల సమ్మేళనంగా చేసుకునే ఉగాది పచ్చడి, ఈ పండుగ ప్రత్యేకతల్లో ఒకటి. తీపి, కారం.. చేదు, వగరు.. లవణం, పులుపు రుచులతో తయారుచేసుకునే ఈ పచ్చడి జీవితంలో ఎదురయ్యే ప్రతి సందర్భాన్ని చాటుతాయి. ఏ ఒక్క సంతోషానికో, దు:ఖానికో, బాధకో, సుఖానికో, లాభానికో, నష్టానికో, జీవితం పరిమితం కాదని జీవితమంటే అన్ని భావోద్వేగాల సమాహారమన్న పరమార్థం అందులో ఉంది. చుట్టూ ఉన్న పరిస్థితుల నుండి మనిషి ఏం నేర్చుకోవాలి? వేటిని అనుసరించాలి? వేటిని విడిచిపెట్టాలి? అన్న జీవితసత్యం ఇది చెబుతుంది.

**మార్పును చూడాలి**

ఉగాది మనిషిని ఉన్నతీకరించే గొప్ప అర్థమున్న పండుగ. మార్పును చూడమని, మార్పు చుట్టూనే లోకప్రగతి దాగుందని చెప్పే ప్రకృతి పండుగ. గతం తాలూకు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఎక్కడివాళ్లక్కడే కూర్చుండిపోతే సమాజం ముందుకు సాగదు. రాలిపోయిన ఆకులను చూస్తూ చెట్టు ఏడుస్తూ కూర్చొంటే ఎప్పటికీ చిగురించలేదు. కాలం వెనక్కి పోతే ప్రగతి లేదు. కానీ ప్రస్తుతం మనిషి కాలంతో పాటు ముందుకు వెళ్లడం లేదు.

> **ఆరోగ్యమస్తు**
>
> **ఉగాది ప్రారంభమే.. వేసవి ఆరంభం.. వేసవి జాగ్రత్తలు పాటించమని కూడా ఈ పండుగ చెబుతుంది. ఉగాది తరువాత ఎండలు పెరుగుతాయి. పిల్లలు, పెద్దలు డీహైడ్రేషన్‌కి గురికాకుండా చూసుకోవాలి. ఎండలు మండే వేళ చర్మ సంరక్షణతో పాటు శరీరాన్ని కాపాడుకోవాలి. శీతల పానీయాలకు బదులు ఇంట్లోనే సహజసిద్ధ పానీయాలు తయారుచేసుకోవాలి. ప్రాంతాలు వేరైనా ఈ రోజు ప్రతిఒక్కరూ చేసుకునే రకరకాల పిండివంటల్లో ఈ ఆరోగ్య సూత్రాలు తప్పకుండా ఉంటాయి.**

శతాబ్దాల క్రితం చరిత్రను తిరగదోడుతూ అక్కడే కొట్టు మిట్టాడుతున్నాడు. అంతకంతకూ అగాధంలోకి కూరుకుపోతున్నాడు. పర్వదినాలు, పవిత్రస్నానాలు అంటూ అందులోనే మునిగితేలుతున్నాడు. ఉగాది నేర్పిన పాఠం ఇది కాదు..

**ఇది ఆధునిక యుగం**

ఇప్పుడు మనం రాజుల కాలంలో లేము. రాకెట్లు వేసుకుని అంతరిక్షంలో విహరిస్తున్నాం. ఆకాశహర్మ్యాలలో నివసిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటిల్జెన్సీతో కలసి జీవిస్తున్నాం. ఇంతటి ఉన్నతిని సాధించిన మనిషి మూలాల్లోకి తొంగిచూస్తే.. మార్పు నుండే ఈ అభివృద్ధి సాధ్యమైందన్న సత్యం అవగతమవుతుంది. మార్పు మొదలైన నాటి నుండే మానవసమాజం అభివృద్ధి చెందడం మొదలైంది. ఆధునికతకి అదే కొలమానం.

**పంచాంగ శ్రవణం**

ఉగాది రోజున పచ్చడికి ఎంత ప్రాధాన్యం ఉందో పంచాంగ శ్రవణానికీ అంత ప్రాముఖ్యం ఉంది. ఆ రోజున ఏడాది మొత్తం ఎలా నడుస్తుందో పంచాంగ కర్తలు చెప్పటం ఆనవాయితీగా వస్తోంది. వానలు ఎలా కురుస్తాయి? ఏఏ పంటలు పండుతాయి? వంటి సంగతులను వివరిస్తారు. విజ్ఞానం ఇంతగా పెరిగిన దశలో వర్షాల రాక, సేద్యంలో మెలకువల గురించి చెప్పటానికి నేడు అనేక విభాగాలు ఉన్నాయి. అయినప్పటికీ ఒక తంతులా పంచాంగ శ్రవణం నడుస్తూనే ఉంది. రైతుల వెతలూ కతలూ ముడిపడి ఉన్నది పంచాంగంతో కాదని మనకు అర్థమవుతూనే ఉంది. అధికారంలో ఉన్న పార్టీలు అవలంబించే విధానాలే సాగుదారుల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. సాగుకు సాయం, పంటకు ధర కావాలంటే– అడగాల్సింది ప్రభుత్వాలనే.

పంచాంగ శ్రవణాలు ఇప్పుడు ప్రహసనంగా మారిపోయాయి. రాజకీయ పంచాంగాలకైతే– కొద్దిపాటి పోలిక కూడా ఉండదు. ఒక్కో పార్టీ కార్యాలయంలో ఒక్కో రకం పంచాంగాలు నడుస్తున్నాయి. ఏ రోటి కాడ ఆపాట పాడటం అన్న చందాన నడుస్తున్నాయి. ఒకప్పుడు కొందరికే పరిమితమైన ఈ పంచాంగాలు నేడు టీవి ఛానెళ్ల ప్రభావంతో ఇంటింటా వినిపిస్తున్నాయి. ప్రకృతి కొన్ని సూత్రాల ఆధారంగా మనకు ఆచరణను నేర్పింది. అలాంటి జాగురతను, జాగ్రత్తనూ ప్రదర్శించటం మంచిపని. మన పూర్వతరాల వారు తమ అనుకూలత, అవసరాల్లోంచి ఉగాది వంటి పండుగలను జరుపుకొంటే– మారిన పరిస్థితుల్లో మనం వాటినే మక్కికి మక్కి అనుసరించటం అశాస్త్రీయం. ప్రకృతి పట్ల అవగాహన, ప్రకృతితో



సమన్వయం, పర్యావరణ స్పృహ, ప్రకృతి ప్రత్యక్షంగా, పరోక్షంగా నేర్పే పాఠాలను అన్వయించుకోవటం– విజ్ఞత. ఆ పరిధిని, పరిమితిని గుర్తెరిగి, ఉగాదిని మనం ఆస్వాదించాలి.

**రైతు సంతోషమే నిజమైన ఉగాది**

పరమార్థాలను పక్కన పెట్టి, పర్వదినాలను జరుపుకుంటే– వట్టి తంతు మాత్రమే అవుతుంది. ఇప్పటి రైతు పరిస్థితి కొన్ని వేల సంవత్సరాల క్రితం నాటిది కాదు. అంతా సవ్యంగా సాగిపోయే స్థితి లేదు. సాగునీరు, పెట్టుబడి, ఎరువులు, మందులు, వాటి ధరలూ, దిగుబడి, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటివన్నీ ఆధునిక కాలపు అవసరాలు. వీటిని పంచాంగం తీర్చదు, ప్రభుత్వమే పట్టించుకోవాలి. రైతు శ్రమించి, వడ్డిస్తున్న వరిధాన్యాలనే మనం భుజిస్తున్నాం కాబట్టి– మనందరం అండగా నిలవాలి. అప్పుడే రైతుకు నిజమైన ఉగాది. దేశానికి బలమైన పునాది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68